## పసిడి ప్రియులకు షాక్..

గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత అంతగా దూకుడు కొనసాగించలేదు. ఆ తర్వాత ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత అంతగా దూకుడు కొనసాగించలేదు. ఆ తర్వాత ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి.. ఈ క్రమంలోనే మంగళవారం తగ్గిన బంగారం ధరలు.. బుధవారం భారీగా పెరిగాయి.. ఒక్కరోజే పసిడి ధర దాదాపుగా రూ.2400 పెరిగింది. లక్ష మార్కు దాటిన తర్వాత.. నెల వ్యవధిలో ధరలు ఇంతలా పెరగడం ఇదే మొదటిసారి.. బుధవారం బులియన్ మార్కెట్ ప్రకారం..24 క్యారెట్ల పసిడి ధర పది గ్రాములపై రూ.2400 మేర ధర పెరిగి


ప్రభాత సూర్య

www.suryaa.news

తెలుగు జాతీయ దిన పత్రిక

వేల రూ.5/ - పేజీలు : 8 గురువారం 22 మే 2025 సంపుటి: 01, సంచిక : 19



విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ఢిల్లీ అతలాకుతలం

- ఢిల్లీలో పెనుగాలుల బీభత్సం.. అంధకారం!
- శ్రీనగర్ వెళుతున్న ఇండిగో విమానంలో భారీ కుదుపులు
- ఢిల్లీ, నోయిడాలో ఈదురుగాలులు, వర్షం
- గంటకు 79 కి.మీ వేగంతో వీచిన ఈదురుగాలులు
- నేలకూలిన హోర్డింగ్‌లు, విరిగిపడ్డ చెట్లు, పలుచోట్ల విద్యుత్ కట్
- విమాన సర్వీసులపై ప్రభావం, ప్రయాణికులకు ఎయిర్‌లైన్స్ సూచనలు

3



## సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడరు

- అయినా పెండింగ్ కేసులపై నింద భరించాలి
- సుప్రీం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్
- పాక్షిక న్యాయస్థాన పనిదినాల్లో రెండు నుంచి ఐదు వరకు వెకేషన్ బెంచ్‌లు పనిచేస్తున్నాయి

## అమెరికా గోల్డెన్ డోమ్.. భారత్ ఐరన్ డోమ్ ఇదే

వివరాలు 3లో..

# బహుముఖ దార్శనికుడు రాజీవ్ గాంధీ

*పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించి నాలుగు రోజుల్లోనే విరమించడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయం ఉంది. ట్రంప్ ఒత్తిడితోనే ఇదంతా జరిగిందని, భారత్ ఆయనకు లొంగిపోయిందని వారు అనుకుంటున్నారు. ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భారత్ కాల్పుల విరమణకు అంగీకరించిందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.*

- దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రాణాలర్పించారు
- సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి తీసుకువచ్చిన మార్గదర్శకుడు ఆర్థిక సరళీకృత విధానాలను అమలు చేసిన స్ఫూర్తిదాయక నాయకుడు రాజీవ్ గాంధీయే
- మేం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నప్పుడు కిషన్‌రెడ్డి ఇంట్లో నిద్రపోతున్నారు
- భారత్.. ట్రంప్‌నకు లొంగిపోయి యుద్ధం విరమించుకుందనే భావన ప్రజల్లో ఉంది
- రాజీవ్ సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సూర్య హైదరాబాద్

'భారతదేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన బహుముఖ దార్శనికుడు రాజీవ్‌గాంధీ.. దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడు.. అందుకే ఆయన వర్ధంతి నాడు నివాళిగా అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని పాటిస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి తీసుకువచ్చిన మార్గదర్శకుడు, ఆర్థిక సరళీకృత విధానాలను - మిగతా2లో

## రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షం

- భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- "ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలి
- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వానలు
- రెండు రోజులపాటు ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వానలు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరిక
- పలు జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్‌లు జారీ



వివరాలు 2లో..



## ధర్మమే గెలుస్తుంది

- కాంగ్రెస్ కమీషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కమిషన్!
- అందుకే విచారణ, నోటీసులు అంటూ సర్కారు డ్రామా
- కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు, పర్సంటేజీల పరిపాలన
- కాంగ్రెస్ కమీషన్ల కకుర్తి వల్లే కుప్పకూలిన ఎస్ఎల్‌బీసీ
- 3 నెలలు దాటినా కనీసం శవాలనైనా వెలికి తీయలేదు
- నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3

# ఉనికిని కోల్పోయిన ఏవోబీ కమిటీ



- దళపతిని కోల్పోయిన మావోయిస్టులు
- ఒక్క ఏడాదిలోనే 540 మంది ఎన్‌కౌంటర్
- ఖాళీ అయిన దండకారణ్య స్పెషల్ జోన్
- మే నెల మావోయిస్టు పార్టీ ఉనికికి కీలకమైనది
- మరో నాలుగు రోజుల్లో, అంటే ఈ నెల 25న నక్సల్బరీ ఆవిర్భావ దినోత్సవం

సూర్య హైదరాబాద్

భారత విప్లవోద్యమ చరిత్రలో తొలిసారి మావోయిస్టులు తమ దళపతిని ఎన్‌కౌంటర్‌లో కోల్పోయారు. కేంద్రం సాగిస్తున్న సాంకేతిక యుద్ధంతో ఏడాది కాలంగా విలవిల్లాడుతున్న మావోయిస్టులకు ఇది శరాఘాతమే.! వెన్ను విరిగినట్టే! మే నెల మావోయిస్టు పార్టీ ఉనికికి కీలకమైనది. మరో నాలుగు రోజుల్లో, అంటే ఈ నెల 25న నక్సల్బరీ ఆవిర్భావ దినోత్సవం రాబోతుంది. అలాంటి మే నెలలోనే నక్సల్స్‌కు ఊహించని దెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్‌లో జరిగిన హోరాహోరీ ఎదురు కాల్పుల్లో బుధవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మరణించారు. ఈ సంఘటన మావోయిస్టుల ఏరివేత యుద్ధం చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలకు పెద్ద విజయమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 'ఎక్స్'లో ప్రకటించారు. బస్వరాజ్ మరణం మావోయిస్టు పార్టీకి ఎంత నష్టం అనేదానికి ఈ ప్రకటనే సాక్ష్యం. మావోయిస్టు పార్టీకి కేంద్ర కమిటీ అంటేనే నిర్దేశిత వ్యవస్థ. ఆ కమిటీకి ప్రధాన కార్యదర్శి అంటే గుండెకాయ. కేంద్ర బలగాలు ఆ గుండెకాయను మట్టుబెట్టాయి. కేంద్రం 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా - మిగతా2లో



## సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నాం

- ప్రధాని నరేంద్ర మోదీ
- సంఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి
- ఆపరేషన్‌లో చాలా మంది మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారని అంచనా.
- మావోయిజం ముప్పును తొలగించేందుకు, ప్రజలకు శాంతియుత, ప్రగతిశీల జీవితాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది

3

## విషాదం మిగిల్చిన అతివేగం



- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం
- హయత్‌నగర్‌లో డీసీఎంను ఢీకొట్టిన కారు
- ముగ్గురు యువకుల మృతి
- కర్ణాటకలోట్రావెల్స్ బస్సును ఢీకొన్న కారు
- కెనరా బ్యాంక్ మేనేజర్, ఆయన భార్య,

2

ప్రభాత సూర్య
తెలుగు జాతీయ దిన పత్రిక


# ఉనికిని కోల్పోయిన ఏవోబీ కమిటీ

-మొదటిపేజీ తరువాయి

చేస్తానని ప్రకటించింది. ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది. కానీ, గడువుకు చాలా ముందే, ఇంత త్వరగా కేంద్రం కమిటీ కార్యదర్శి, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ నేతలు అనేక మంది ఒకే ఎన్‌కౌంటర్‌లో హతమవ్వడం భద్రతాబలగాల ఆధిపత్యాన్ని నిరూపిస్తోంది.

**హడలెత్తిస్తున్న హైటెక్ వార్...**

2024లో ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 540 మంది మావోయిస్టులు మరణించారు. టాప్ నాయకత్వం నుంచి జిల్లా కమిటీ సభ్యుని దాకా మరణించినవారిలో ఉన్నారు. యూపీఏ హయాంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా సగటున ఏడాదికి 80 మంది మావోయిస్టులు మరణించేవారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ అందుకు భిన్నంగా సాగుతోంది. ఒక విధంగా అత్యాధునిక సాంకేతిక యుద్ధం సాగుతోంది. వేలాది పారామిలటరీ బలగాలు, రాష్ట్ర ప్రత్యేక బలగాలు ఈ యుద్ధంలో పాల్గొంటున్నాయి, అడవులను జల్లెడ పట్టేందుకు హైటెక్ విధానాలను అనుసరిస్తున్నారు. మానవ రహిత డ్రోన్లను వాడి విజయాలు సాధిస్తున్నారు. దండకారణ్యంలో ఇద్దరు లేదా ముగ్గురి కంటే ఎక్కువ మంది కదలికలు ఉన్నా, ఆయుధాలు, ఇతర సామగ్రిని సైతం కనిపెట్టి భద్రతా బలగాలకు వాటి లొకేషన్‌తో కూడిన వివరాలను మ్యాప్‌లతో సహా అందించే అత్యాధునిక వార్ కేటగిరి సైలెంట్ కిల్లర్ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. అవి ఒకటో, రెండో కాదు. మావోయిస్టులకు పట్టున్న అబూజ్‌మడ్, నారాయణపూర్, బీజాపూర్, కాంకేర్, ఆంధ్రా–ఒడిసా బోర్డర్.....ఇలా ఆయా ప్రాంతాలను బట్టి, అవసరాలను బట్టి లెక్కకు మించిన డ్రోన్లను రోజువారీగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల భద్రతా బలగాలు అడవుల్లోని భారీ కొండలు, గుట్టలు ఎక్కి, దిగాల్సిన పనిలేదు. అనుమానంతో ఓ డ్రోన్‌ను ఫ్లైయింగ్ చేపిస్తే 18–25 కిలోమీటర్ల పరిధిలోని అడవిలో ఎక్కడ ఏం ఉందో సులువుగా కనిపెట్టవచ్చు. ఇవి భద్రతా బలగాల చేతికి అందిన తర్వాతే గత ఏడాది కాలంగా ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరిగిపోయింది. సగటున ఒక్కో సంఘటనలో 20 –30 మంది చొప్పున మరణిస్తున్నారు. మానవ రహిత డ్రోన్లు అడవుల్లో ఉన్న మావోయిస్టుల జాడను లొకేషన్‌తో సహా ఇస్తుండటంతో వారున్న ప్రాంతాలను బలగాలు రెండు లేదా మూడు గంటల వ్యవధిలోనే చుట్టుముడుతున్నాయి. డ్రోన్ సర్వైలెన్స్ ఇచ్చే డేటాతో ఒకేసారి వేలాది మంది భద్రతా బలగాలు మావోయిస్టులపై దాడులు చేస్తున్నాయి. దీంతో మావోయిస్టుల వైపు ప్రాణనష్టం చాలా ఎక్కువగా ఉంటోంది.

**షెల్టర్ జోన్‌లలోకి తిరోగమనం..**

వరుస ఎన్‌కౌంటర్లతో గడ్డు పరిస్థితుల్లో ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్రంతో చర్చలకు సిద్ధమని ప్రకటించింది. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ రెండుసార్లు శాంతిచర్చల ప్రతిపాదన చేశారు, కేంద్రం ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించలేదు సరికదా...మావోయిస్టు గెరిల్లాలకు ఆశ్రయమైన కర్రెగుట్టల ప్రాంతాన్ని జల్లెడ పట్టించింది. ఇక చర్చలకు కేంద్రం అవకాశం ఇవ్వదని మావోయిస్టు పార్టీకి సంకేతాలు వెళ్లాయి. వార్ జోన్ నుంచి షెల్టర్ జోన్‌కు వెళ్లాలని పార్టీ ముఖ్యనేతలకు కేంద్ర కమిటీ నుంచి సూచనలు వెళ్లినట్లుగా ఇటీవలి తనిఖీల్లో వెలుగుచూసిన పలు డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తోంది.

**ఖాళీ అవుతున్న కమిటీలు..**

గత ఏడాది సెప్టెంబరు నాటి మావోయిస్టు పార్టీ డాక్యుమెంట్ ప్రకారం కేంద్ర కమిటీ సభ్యులు 21 మంది. పొలిట్‌బ్యూరో సభ్యులు 13మంది. కానీ తాజా పరిణామాలతో కమిటీ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మావోయిస్టు పార్టీకి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) కీలకమైనది. ఇందులో నుంచే అనేక మంది కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో సభ్యులుగా ఉన్నారు. గత ఏడాది కాలంగా ఈ కమిటీలో 18 మంది ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఉప కమిటీల పరిధిలో 120 మంది మరణించారు. దీంతో దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ దాదాపుగా ఖాళీ అయినట్లేనని పోలీసువర్గాలు చెబుతున్నాయి. దక్షిణాదిలో కేరళలోనే ఆ పార్టీకి కొంత పట్టు ఉంది. గత ఏడాది జరిగిన ఎన్ కౌంటర్‌లో ఇద్దరు రాష్ట్రకమిటీ సభ్యులు అక్కడ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఏపీ, తెలంగాణల్లో ప్రత్యేకంగా దళాలు లేని పరిస్థితి. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు కమిటీలో 18 మంది కీలక నేతలు ఉన్నా వ్యక్తులుగానే ఉన్నారని సమాచారం. వరుస ఎన్‌కౌంటర్ల నేప?థ్యంలో ఏఓబీ కమిటీ కూడా ఉనికిని కోల్పోయే పరిస్థితి వచ్చిందని ప్రజాసంఘాలు చెబుతున్నాయి.

**వేధిస్తున్న వయో భారం**

మావోయిస్టులను వేధిస్తున్న మరో సమస్య వయోభారం. పార్టీ కేంద్ర కమిటీలో మిగిలిన అగ్రనాయకుల్లో ఎక్కువ మంది 60 నుంచి 75 ఏళ్ల మధ్యలో ఉన్నారు. వీరిలో చాలామంది వయోభారంతో, అనారోగ్యాలతో కదల్లేని స్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన అగ్రనాయకత్వాన్ని కాపాడుకోలేని పరిస్థితి వారికి ఏర్పడింది. 2010 ప్రాంతాల్లో 96 జిల్లాల్లో బలమైన ప్రభావం చూపిన మావోయిస్టు పార్టీ 2023 నాటికి 46 జిల్లాలకు పరిమితమైంది. ఆపరేషన్ కగార్ తర్వాత ఆరు జిల్లాలకే పరిమితమైంది.

**ఎందుకీ పరిస్థితి?**

ఒకప్పుడు నక్సల్స్‌కు అడవులు సురక్షితమైనవి. అడవుల్లో ఉంటూనే దళాల నిర్మాణం చేసి విముక్తి ప్రాంతాలను ప్రకటించారు. నగర, పట్టణ ప్రాంతాల్లో యాక్షన్‌లు చేపట్టేందుకు టీమ్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అయితే టెక్నాలజీ పెద్దగా లేని సమయంలో నక్సల్స్ ఏరివేతకు పోలీసు బలగాలు ప్రధానంగా మేధస్సును నమ్ముకొని పనిచేశాయి. కోవర్ట్ సిస్టమ్‌ను డెవలప్ చేసి కీలకనేతలను మట్టుబెట్టారు. అడవుల్లోకి వెళ్లి నక్సల్స్‌ను తుదముట్టించాలని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు పార మిలటరీ బలగాలను రంగంలోకి దింపి ప్రత్యేక చర్యలు చేపట్టాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు అత్యాధునిక ఆయుధాలు వినియోగించింది. చీకట్లో కూడా నక్సల్స్‌ను గుర్తించేందుకు నైట్‌విజన్ గ్లాసెసను వినియోగించింది. ఆ తర్వాత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంది. మావోయిస్టుల ఏరివేతకు సాధారణ డ్రోన్లను ఉపయోగించారు. వాటిని నక్సల్స్ కూల్చివేశారు. కానీ 2023 నుంచి అత్యాధునికమైన మానవ రహిత, శ బ్దరహిత యుద్ధడ్రోన్లను మావోయిస్టు ఆపరేషన్స్‌కోసం కేంద్రం ఉపయోగిస్తోంది. ఒకవైపు పెరిగిన నిర్బంధం, మరోవైపు డ్రోన్‌దాడులు, ఆధునిక యుద్ధాన్ని ఎదుర్కోలేక ఇంకా సంప్రదాయ కాలి నడక మార్గాల్లోనే పయనిస్తూ మృత్యువులోకి వెళ్లిపోతున్నారు. అసలు అడవుల్లోనే ఉంటూ మావోయిస్టు సాయుధుడిగా ప్రాణాలు కాపాడుకోవడం ఎలా? అన్నది ఇప్పుడు మావోయిస్టు పార్టీ ముందున్న అతిపెద్ద సవాల్. కేంద్రం కోరుతున్నట్లుగా మావోయిస్టులు అస్త్రసన్యాసం చేసి సాయుధంగా లొంగిపోలేరు. అలాగని అడవుల్లోనే ఉంటూ పాత పద్ధతులు, కాలం చెల్లిన వ్యూహాలతో సాయుధపోరాటం అంటే విడతల వారీగా మృత్యువును ఆహ్వానించడమే అవుతుంది.

**టాప్ ఆర్డర్ కూలిందిలా..**

బెంగాల్‌లోని నక్సల్బరీలో 1967 మే 25న మొదలైన సాయు?ధ రైతాంగ తిరుగుబాటును అసలైన మార్గంగా గుర్తించినవారిని నక్సల్స్‌గా వ్యవహరిస్తున్నారు. 1968లో వీరంతా చారుమజుందార్ నాయకత్వాన్ని అంగీకరించి, ఆయన కేంద్ర కమిటీ కార్యదర్శిగా సీపీఐ(ఎం.ఎల్.) పార్టీని ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఏపీ నుంచి పంచాది కృష్ణమూర్తి కేంద్ర కమిటీ సభ్యునిగా ఉండేవారు. ఆ తర్వాత ఎన్‌ఔంటరులో ఆయన మరణించారు. చారుమజుందార్ పోలీసులకు పట్టుబడి 1972 జూలై 28న కస్టడీలో చనిపోయారు. పోలీసుల అదుపులో ఉండగా ఒక కేంద్ర కమిటీ కార్యదర్శి మరణించిన తొలి సంఘటన అది. ఆ తర్వాత జరిగిన అతిపెద్ద సంఘటన బస్వరాజ్ ఎన్‌కౌంటరే. 1980లో పీపుల్స్‌వార్ ఏర్పడే నాటికి సీపీఐ(ఎం.ఎల్.)గా ఉన్న పార్టీలో అనేక మంది సాయుధపోరాట పంథాలో సాగారు. కానీ పార్టీకి సార?థ్యం వహిస్తున్నవారెవ్వరూ ఎన్‌కౌంటర్లలో మరణించలేదు. పీపుల్స్‌వార్ 1980లో కొండపల్లి సీతరామయ్య నేతృత్వంలో ఆవిర్భవించిన తర్వాత అనేక రాష్ట్ర కమిటీ నేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. ఉమ్మడి ఏపీలో గ్రేహౌండ్స్ బలగాల ఆపరేషన్స్‌లో రాష్ట్ర కార్యదర్శి పులిఅంజయ్య, ఆ తర్వాత మాధవ్ చనిపోయారు. 1999 డిసెంబరులో పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి, శీలం నరేశ్ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. 2004లో పీపుల్స్‌వార్ దండకారణ్యంలోని ఎంసీసీతో విలీనం తర్వాత సీపీఐ(మావోయిస్టు) పార్టీగా అవతరించింది. ఆ తర్వాత 2009లో కేంద్రం మావోయిస్టుల ఏరివేత కోసం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. ఇక అప్పటి నుంచి కీలక నేతల ఎన్‌కౌంటర్లు సెలక్టీవ్‌గా జరిగాయి. ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్), కిషన్‌జీ (మల్లోజుల కోటేశ్వరరావు), పటేల్ సుధాకర్‌రెడ్డి(సూర్యం), శాఖమూరి అప్పారావు వంటి అనేక మంది కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఆపరేషన్ కగార్‌లో వరస ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయి. ఛత్తీస్‌గఢ్– ఒరిశా సరిహద్దుల్లో గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మరణించారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ కమిటీ కీలక నేత రాంజీ మరణించారు. ఇప్పుడు కేంద్ర కమిటీ కార్యదర్శి బస్వరాజ్‌నే కోల్పోయారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు తప్పుకొన్న తర్వాత బాధ్యతలు స్వీకరించిన కేశవరావు ఉత్తరాది, దక్షిణాది మావోయిస్టు దళాలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని నడిపారు. మావోయిస్టు పార్టీని దేశమంతటా విస్తరించడంలో ప్రధానపాత్ర పోషించారు. కరోనా కాలం కూడా మావోయిస్టులను భయపెట్టింది. తెలంగాణ కార్యదర్శి హరిభూషన్ కరోనాతో ఉద్యమంలోనే మరణించారు. కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్‌కౌంటరులో మరణించిన నల్లా ఆదిరెడ్డి భార్య సరోజినిని కరోనా బలి తీసుకుంది.

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షం

హైదరాబాద్

నగరంలో పలుచోట్ల వర్షం దంచికొడుతోంది. సికింద్రాబాద్, బేగంపేట్, బోయిన్‌పల్లి, బంజారాహిల్స్, మోహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, కార్వాన్, మలక్‌పేట్, సైదాబాద్, చాదర్ ఘాట్, మారేడుపల్లి, షేక్‌పేట్, మాదాపూర్, గచ్చిబౌలి, అత్తాపూర్, అంబర్‌పేట్, అత్తాపూర్, రాజేంద్రనగర్, నల్లకుంట, నాచారం, తార్నాక, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ఉప్పల్, రామంతాపూర్‌లో భారీ వర్షం కురుస్తోంది. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని నగరం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వానలు పడుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం 'రెయిన్ అలర్ట్' జారీ చేసింది.



ఉపరితల ద్రోణి ఉదయం నుంచి హైదరాబాద్–సికింద్రాబాద్ జంట నగరాలపై మేఘాలు కమ్ముకోగా.. మధ్యాహ్నం నుంచి పలుచోట్ల ఈదురు గాలులతో వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వాన పడుతోంది. మలక్ పేట్, నాంపల్లి, చార్మినార్, దిల్‌సుఖ్ నగర్, కోఠి, రామంతపూర్, అబిడ్స్, అంబర్‌పేట్.. తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఖైరతాబాద్, లక్డీకాపూల్, రాజ్ భవన్, ట్యాంక్ బండ్ సమీపంలో స్వల్ప వర్షంతో మొదలై.. జడి వానగా మారింది. నగర శివారు ప్రాంతాల్లో చోట్ల చిరు జల్లులు పడుతున్నాయి. మరికొన్ని గంటల్లో జంట నగరాల వ్యాప్తంగా పూర్తి స్థాయిలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. అలాగే.. రాత్రి సమయంలో హైదరాబాద్‌లో తీవ్రమైన తుఫాను వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అప్రమత్తం అయ్యింది. సాయంత్రం పనులు ముగించుకుని వెళ్లేవాళ్లను అప్రమత్తం చేస్తోంది. మ్యాన్ హెూల్స్, కరెంట్ పోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని నగర ప్రజలకు సూచించింది.

ఇదిలా ఉంటే.. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాజధాని నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులపాటు ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వానలు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేసింది. ఇక పంట చేతికొచ్చే సమయం కావడంతో అప్రమత్తంగా ఉండాలని రైతులకు అధికార యంత్రాంగం సూచిస్తోంది.

**తెలంగాణకు రెయిన్ అలర్ట్**

వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెయిన్ అలర్ట్ జారీ చేసింది. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉండడంతో.. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ముందస్తు ప్రణాళికలతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. అలాగే..ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్లను సైతం అందుబాటులో ఉండాలని ఆదేశించింది.

"ఋతుపవనాలు ముందుగా రాబోతున్నాయి. అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలి. 2024లో కురిసిన భారీ వర్షాలకు అందుబాటులో లేకపోవడంతో గోల్డెన్ అవర్ కోల్పోయాం. 2024 సెప్టెంబర్ లాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కావొద్దు. జిల్లాల్లో కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు, సమన్వయం చేసుకోవాలి. సింగరేణి లో ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ టీమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి" అని సర్క్యులర్‌లో డిజాస్టర్స్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ పేర్కొన్నారు.

సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సీఎస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. "ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. కలెక్టర్లు.. కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలి. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలి. ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలి. జీహెచ్‌ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలి. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలి" అని సీఎస్‌ను ఆదేశించారాయన.

## విషాదం మిగిల్చిన అతివేగం..

హైదరాబాద్/గద్వాల క్రైం

బుధవారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్, కర్ణాటకలోని విజయపుర జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 8 మంది మృతిచెందారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు యువకులు వారి కుటుంబాల్లో ఒక్కరే మగపిల్లలు కాగా, కర్ణాటకలో జరిగిన ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఓ కుటుంబంలో ఒక్కరు తప్ప అందరూ మృత్యుఒడికి చేరారు.

**విషాదం మిగిల్చిన అతివేగం..**

హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదంలో అతి వేగం నాలుగు కుటుంబాలలో పెను విషాదం మిగిల్చింది. వేగంగా వచ్చిన కారు ఎదురుగా వస్తున్న డీసీఎంను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌కు చెందిన పిన్నింటి చంద్రసేనారెడ్డి (24), చుంచు త్రినాథ్‌రెడ్డి (24), చుంచు వర్షిత్‌రెడ్డి (23), ఎలిమేటి పవన్‌కల్యాణ్‌రెడ్డి చిన్నప్పటినుంచి స్నేహితులు. బుధవారం తెల్లవారుజామున వారంతా పస్మాముల వైపు నుంచి కుంట్లూర్‌కు స్కోడా కారులో వస్తున్నారు. ఉదయం 5:40 గంటల సమయంలో కుంట్లూర్‌లోని నారాయణ కళాశాల సమీపంలోని గ్యాస్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో కారులో ఉన్న చంద్రసేనారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డిలు అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడ్డ పవన్‌కల్యాణ్‌రెడ్డిని కారులో నుంచి బయటికి తీసిన పోలీసులు చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. కాగా, మంగళవారం రాత్రి ఓ రిసెప్షన్‌కు హాజరైన ఈ యువకులు మధ్యలో ఓ ఫాంహౌస్‌లో గడిపినట్లు తెలిసింది. అక్కడి నుంచి ఇంటికి బయలుదేరిన వారు కొద్దిసేపట్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా మృత్యుఒడిలోకి చేరుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులలో ముగ్గురు మృతి చెందగా, డ్రైవర్‌సీటు పక్కన కూర్చున్న పవన్‌కల్యాణ్‌రెడ్డి గాయాలతో బయటపడ్డాడు. అతను సీటు బెల్టు పెట్టుకోవడంతో బెలూన్ ఓపెన్ అయినట్లు పోలీసులు తెలిపారు.

**వారసులను కోల్పోయిన కుటుంబాలు...**

పిన్నింటి చంద్రసేనారెడ్డి, చుంచు త్రినాథ్‌రెడ్డి, చుంచు వర్షిత్‌రెడ్డి వారి కుటుంబాల్లో ఒకరే మగపిల్లలు. వీరిలో త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డిలు అన్నదమ్ముల కుమారులు. వారిద్దరూ ప్రమాదంలో మృతి చెందడంతో తమకు వారసులు లేకుండా పోయారని, చేతికి అందివచ్చిన కొడుకులు ఇలా మృతిచెందారని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

**ఒకే కుటుంబంలో నలుగురు మృతి..**

కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గద్వాల పట్టణం బీసీ కాలనీకి చెందిన తెలుగు భాస్కర్ (41) మహారాష్ట్రలో కెనరా బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల మహారాష్ట్రలోని భండారా జిల్లా వార్తి ప్రాంతం నుంచి హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం భార్య పవిత్ర (38), కుమార్తె జ్యోత్న్స (10), కుమారులు అభిరాం (8), ప్రవీణ్‌తో పాటు కర్ణాటకకు చెందిన డ్రైవర్ శివప్ప (45)తో కలిసి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో కర్ణాటకలోని విజయపుర జిల్లా మనగులి సమీపంలో సోలాపూర్– చిత్రదుర్గ హైవేపై వీరు ప్రయాణిస్తున్న స్కార్పియో కారు డివైడర్‌ను ఢీకొని అవతలి లేన్‌లో ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో స్కార్పియో కారు తుక్కుతుక్కు కాగా అందులో ఉన్న భాస్కర్, పవిత్ర, జ్యోత్న్స, అభిరాం, డ్రైవర్ శివప్పలు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం అక్కడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలతో బయటపడిన ప్రవీణ్ కుటుంబసభ్యులను కోల్పోయి అనాథగా మిగిలాడు.

## బహుముఖ దార్శనికుడు రాజీవ్ గాంధీ



-మొదటిపేజీ తరువాయి

అమలు చేసిన స్ఫూర్తిదాయక నాయకుడు రాజీవ్ గాంధీయే. దేశ భవిష్యత్‌ను నిర్దేశించడంలో యువత పాత్ర కీలకమని ముందే ఊహించిన ఆయన.. ఓటు హక్కు పొందే వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ఏర్పాటుచేస్తే సంకుచిత భావాలున్న కొందరు నాయకులు రాద్ధాంతం చేస్తున్నారు. అటు అమరవీరుల సంస్మరణ వేదిక, ఇటు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు విగ్రహాలు, నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహమున్న ఈ ప్రాంతంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఉండటం సముచితం. పార్టీలకు అతీతంగా ఆయనకు నివాళులర్పించాల్సి ఉంది" అని అన్నారు.

**మేం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నప్పుడు కిషన్‌రెడ్డి ఇంట్లో నిద్రపోతున్నారు**

"పహల్గాంలో ఉగ్రవాద దాడికి బదులుగా భారత జవాన్లు సరిహద్దుల్లో పోరాడుతుంటే వారికి మద్దతుగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడింది. నాలుగుకోట్ల ప్రజల తరఫున త్రివర్ణ పతాకం చేతబూని తిరంగా ర్యాలీని నిర్వహించాం. ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి మద్దతుగా నిలబడ్డాం. దేశ సమగ్రతను కాపాడుతున్న కేంద్ర ప్రభుత్వానికి బాసటగా మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మాట్లాడారు. వీటిని విస్మరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. రాహుల్ గాంధీని నిందిస్తున్నారు. మేం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నప్పుడు కిషన్‌రెడ్డి ఇంట్లో దుప్పటి కప్పుకొని నిద్రపోతున్నారు. రాష్ట్రం మొత్తం జవాన్లకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తే అభినందించేందుకు ఆయనకు నోరు రాలేదు.. పైగా దూషణలకు దిగుతున్నారు. పాకిస్థాన్‌ను ఓడిస్తే ప్రపంచమంతా మీకు(కేంద్రానికి) ఆహ్వానం పలుకుతుంది. ఇందుకు భిన్నంగా మీరు గొప్పలు చెప్పుకొనేందుకు పార్టీ శ్రేణులను రోడ్లపై తిప్పుతున్నారు. భాజపా నాయకులు గొప్పవాళ్లో... కాదో ప్రజలు నిర్ణయిస్తారు. ఇప్పటికైనా ఉగ్రమూకలను ఏరివేయండి. ఉగ్రవాదం పీచమణచండి.. పార్టీలకు అతీతంగా మీకు అండగా ఉంటాం.

**ప్రజలంతా ఉక్కు మహిళ ఇందిరను స్మరించుకున్నారు**

పహల్గాం దాడి అనంతర ఘటనల సందర్భంగా ప్రజలంతా ఉక్కు మహిళ ఇందిరా గాంధీని స్మరించుకున్నారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గకుండా నాడు పాకిస్థాన్‌ను నిట్టనిలువునా చీల్చేసి బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమై... పాకిస్థాన్‌కు శాశ్వత గుణపాఠం నేర్పారని గుర్తు తెచ్చుకున్నారు. అమెరికా అధ్యక్షుడి మాటలను లెక్కచేయకుండా నిటారుగా నిలబడిన ఆమె ధైర్యాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు" అని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మక్కాన్‌సింగ్ ఠాకూర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, రాష్ట్ర పరిశీలకుడు విశ్వనాథ్, మాజీ ఎంపీ వీహెచ్, మేయర్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# అమెరికా గోల్డెన్ డోమ్.. భారత్ ఐరన్ డోమ్ ఇదే

ఢిల్లీ

అతి శక్తిమంతమైన ఆయుధాలు. అంతకు మించిన నిఘా సంపత్తి. అవడానికి చిన్న దేశమే అయినా సైనిక సంపత్తిలో మాత్రం ఇజ్రాయెల్ అక్షరాలా అమేయ శక్తే. సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధంలో అటు ఇరాన్, ఇటు హిజ్బొల్లాలు ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడి చేశాయి. అయితే ఈ దాడిలో రాకెట్లను ఐరన్ డోమ్ అడ్డగించింది. రాడార్ టెక్నాలజీ సాయంతో అడ్డగించి తుత్తునియలు చేసి తన సామర్థ్యం ఏంటో ఇజ్రాయెల్ ప్రపంచానికి చాటి చెప్పింది. దీంతో ఇప్పుడు ఈ ఐరన్ డోమ్ వ్యవస్థపై ప్రపంచ దేశాలు కన్నేశాయి. మొబైల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఐరన్‌డోమ్‌తో శత్రు దుర్భేద్య దేశంగా పేరొందేందుకు భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. ఇప్పుడీ ఐరన్ డోమ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. అమెరికాను బాలిస్టిక్,క్రూజ్ క్షిపణుల దాడుల నుంచి రక్షించేందుకు 175 బిలియన్ డాలర్ల వ్యవస్థతో గోల్డెన్ డోమ్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో అసలు ఐరన్ డోమ్ అంటే ఏంటి? ఎలా పనిచేస్తుంది? ఇది ఎలా పనిచేస్తోంది?వంటి వివరాలు చూద్దాం.

**గోల్డెన్ డోమ్ అంటే ఏమిటి?**

గోల్డెన్ డోమ్ అనేది అమెరికా కోసం రూపొందించబడిన అంతరిక్ష ఆధారిత క్షిపణి నిరోధక కవచం. శుత్రువులు ప్రయోగించిన రాకెట్లను భూమి మీదకు చేరుకునే లోపే అడ్డుకునేలా టెక్నాలజీని వినియోగిస్తోంది. ఉదాహరణకు ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌లు భూమి మీద ఉన్న ఇంటర్‌సెప్టర్లు (%×త్వతీషెవజ్‌శీతీం%) ఆధారంగా పనిచేస్తే, అమెరికా గోల్డ్ డోమ్ పూర్తిగా అంతరిక్షంలో శాటిలైట్ ద్వారా పనిచేస్తాయి. ఈ గోల్డెన్ డోమ్‌లో శాటిలైట్స్ ఉంటాయి. ఇవి క్షిపణులు ఎగురటం ప్రారంభమైన వెంటనే వాటిని గుర్తించి, ప్రారంభ దశలోనే వాటిని నిలువరించే సామర్థ్యం సత్తా దీని సొంతం.




ఈ సాంకేతికత అమెరికా భూమిపైకి మాత్రమే కాకుండా ఇతర ఖండాల నుండి లేదా అంతరిక్షం నుండి వచ్చే క్షిపణుల నుండి కూడా రక్షణ కలిగిస్తుంది. ఇది చైనా, రష్యా, ఉత్తర కొరియా, భవిష్యత్తులో ఇరాన్ లాంటి దేశాలు తలపెట్టే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అమెరికా రూపొందిస్తోంది.బాలిస్టిక్, హైపర్‌సోనిక్, క్రూయిజ్ క్షిపణుల నుంచి దేశాన్ని రక్షిస్తోంది. గోల్డెన్ డోమ్‌లో అవుటర్ లేయర్ స్పేస్ బేస్డ్ ఇన్‌ఫ్రారెడ్ సిస్టమ్ (%హదీ×=హా%),గ్రౌండ్-బేస్డ్ రాడార్స్‌తో పాటు,మిసైల్ లాంఛర్లను అడ్డుకుంటుంది.

**భారత్‌కు ఆకాశ్**

ఇజ్రాయెల్ ఐరన్ డోమ్, అమెరికా గోల్డెన్‌డోమ్.. భారత్‌కు ఆకాశ్. ఆకాశ్ భారత్ క్షిపణి రక్షక వ్యవస్థ. 30 కి.మీ. దూరంలో, 18,000 మీ. ఎత్తులో ఎగురుతున్న శత్రు విమానాల్ని కూల్చేస్తుంది. గాల్లో ఎగురుతున్న యుద్ధ విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, గాలి నుండి భూమికి ప్రయోగించే క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులనూ నిర్వీర్యం చెయ్యగల సామర్థ్యం ఈ క్షిపణికి ఉంది. ఒక్కో ఆకాశ్ బ్యాటరీలో నాలుగు లాంచర్లు, ఒక్కో లాంచరులో మూడేసి క్షిపణులూ ఉంటాయి. ఇందులో ఒక రాజేంద్ర 3డీ పాసివ్ ఎలక్ట్రానికల్లీ స్కాన్డ్ ఎర్రే రాడార్ కూడా ఉంటుంది. ప్రతీ బ్యాటరీ ఏకకాలంలో 64 లక్ష్యాలను పరిశీలిస్తుంది. వాటిలో 12 లక్ష్యాలను ఛేదించగలదు.ఒక్కో క్షిపణిలో 60 కిలోగ్రాము శకలాలతో కూడుకున్న వార్‌హెడ్ ఉంటుంది.ఆకాశ్ వ్యవస్థ తేలిగ్గా ఎక్కడికంటే అక్కడికి తరలించవచ్చు.

# ధర్మమే గెలుస్తుంది

నల్లగొండ

కాంగ్రెస్ ప్రభుత్వం తమ కమీషన్లు, దందాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణ కమిషన్లు, నోటీసులు అంటూ డ్రామాలాడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాపాలన అంటూనే పర్సంటేజీల పాలనగా మార్చేశారని దుయ్యబట్టారు. స్వయంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, చివరికి రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు సైతం ప్రభుత్వ పెద్దల 20 శాతం, 30 శాతం కమీషన్ల గురించి నిజాలు బయటపెడుతున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలడానికి ప్రభుత్వ పెద్దల కమీషన్ల కక్కుర్తే కారణమని విమర్శించారు. ఇలాంటివన్నీ కప్పిపుచ్చుకొనేందుకే కమిషన్ల పేరిట నాటకాలు ఆడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని డ్రామాలాడినా అవన్నీ దూది పింజల్లా తేలిపోవడం ఖాయమని చెప్పారు. నల్లగొండలో బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, బీఆర్ఎస్‌వీ మాజీ నాయకుడు జిల్లా శంకర్ వివాహానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై దంపతులను ఆశీర్వదించారు. అనంతరం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలు ప్రతి పనిలో వసూలు చేస్తున్న కమీషన్ల మీద రాష్ట్రం మొత్తం గగ్గోలు పెడుతున్నదని విమర్శించారు. చిన్న చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లు సైతం ఏకంగా సచివాలయంలో ధర్నాకు దిగి 20 శాతం, 30 శాతం కమీషన్ల వ్యవహారాన్ని బట్టబయలు చేశారని గుర్తుచేశారు. చివరికి ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కమీషన్లు లేనిది, పైసలు లేనిది ఈ ప్రభుత్వంలో పనులు కావడం లేదని బహిరంగంగానే చెప్తుండటం పట్ల సిగ్గు పడాలని నిప్పులు చెరిగారు.

**బాధ్యులపై చర్యలేవి?**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి పోయి కార్మికులు ప్రాణాలు కోల్పోతే ఇప్పటికి బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని నల్లగొండ రైతుల తరపున, ప్రజల తరపున రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నానని కేటీఆర్ చెప్పారు. 'మీ కమీషన్ల కకుర్తితో ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోతే అందులో చికుకుపోయిన వారి శవాలను కూడా తీయలేకయింద్రు. కనీసం ఆ పనుల్లో ఏం జరిగిందో ప్రజలకు చెప్పే పరిస్థితి కూడా లేదు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటి వరకు అందుకు కారణమైన సంస్థపై విచారణ లేదు. చర్యలు లేవు' అని ఫైర్ అయ్యారు.

**కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపే కుట్రలు**

కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపే ప్రచారం చేస్తూ కుట్రలకు తెరలేపాయని, ప్రజలకు వాస్తవాలు తెలుసునని, దేశంలోని చట్టాల మీద, న్యాయవ్యవస్థ మీద తమకు సంపూర్ణ నమ్మకం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. 'మీరు ఎన్ని నోటీసులిచ్చినా, డ్రామాలు చేసినా ముమ్మాటికీ న్యాయం, ధర్మం గెలుస్తాయి. తెలంగాణకు మేలు చేసిన వారిని ఆ దేవుడే కాపాడుతాడు' అని స్పష్టం చేశారు. .'మీరు త్రీడీ మంత్రంగా భావిస్తున్న డిసెప్షన్, డిస్ట్రెక్షన్, డిస్ట్రాక్షన్ అనే మీ ఆలోచనలు ఎకువ రోజులు నడువవు.

కమిటీల పేరిట, కమీషన్ల పేరిట కాలయాపన చేస్తూ ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తూ 420 హామీల అమలును పట్టించుకోవడం లేదు. ఇచ్చిన ప్రతి అడ్డగోలు హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని హెచ్చరించారు. ముమ్మాటికీ తెలంగాణ ప్రజలు తిరగబడి సాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కేటీఆర్ వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఒంటెద్దు నర్సింహారెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్న చిన్న కాంట్రాక్టర్లు సైతం ఏకంగా సచివాలయంలో ధర్నాకు దిగి మీ కమీషన్ల వ్యవహారాన్ని బట్టబయలు చేసింద్రు. చివరికి మీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కమీషన్లు లేనిది, పైసలు లేనిది ఈ ప్రభుత్వంలో పనులు కావని బహిరంగంగానే చెప్తున్నరు. మీ కమీషన్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కాళేశ్వరం కమిషన్ పేరిట డ్రామాలాడుతున్నరు.

**రెండేండ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు**

**కేటీఆర్‌కు మొర పెట్టుకున్న ఎంబీబీఎస్ విద్యార్థిని**

రెండేండ్ల నుంచి ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలేదని ఓ వైద్య విద్యార్థిని.. కేటీఆర్‌తో మొర పెట్టుకున్నది. బుధవారం నల్లగొండలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ వివాహానికి కేటీఆర్ హాజరయ్యారు. సమాచారం తెలుసుకున్న ఎంబీబీఎస్ విద్యార్థిని మేకల వర్షిణి కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. నల్లగొండకు చెందిన వర్షిణి సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నది. తన అక్క మేకల కౌశికి కూడా ఈ ఏడాది నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌తోపాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్నది. ఎస్సీ విభాగానికి చెందిన మెడికల్ విద్యార్థులకు నిబంధనల ప్రకారం ఏడాదికి రూ.60వేల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే నేరుగా కాలేజీలకు చెల్లించాల్సి ఉన్నది. గత రెండేండ్లకు సంబంధించిన రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించలేదు. ఇటీవల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న కౌశికి తన సర్టిఫికెట్లు తీసుకుందామని కాలేజీకి వెళ్తే ఫీజు పెండింగ్ ఉంది. అది క్లియర్ చేస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికిప్పుడు ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకునే స్థోమత లేని కౌశికి కుటుంబసభ్యులు కేటీఆర్‌కు తమ పరిస్థితిని వివరించారు. కేటీఆర్ స్పందిస్తూ%% రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

# సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నాం

ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావు సహా 27 మంది నక్సల్స్‌ని భద్రతా బలగాలు హతమార్చాయి. సంఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆపరేషన్‌లో చాలా మంది మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారని అంచనా. ఎన్‌కౌంటర్‌లో డీఆర్‌జీ జవాన్ అమరుడయ్యాడు. ఈ ఆపరేషన్‌లో మరికొందరు జవాన్లు గాయపడ్డారు. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక కీలక నేత సహా 27 మావోయిస్టులను మట్టుబెట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా భద్రతా బలగాలను ప్రశంసించారు.

సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నామన్నారు. మావోయిజం ముప్పును తొలగించేందుకు, ప్రజలకు శాంతియుత, ప్రగతిశీల జీవితాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని 'ఎక్స్' వేదికగా స్పందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. నక్సల్స్



నిర్మూలన ఇదో మైలురాయి విజయమని పేర్కొన్నారు. సీపీఐ మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్ర నేత, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సైతం ఉన్నారని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నేతను దళాలు మట్టుబెట్టడం ఇదే తొలిసారని సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా భద్రతా బలగాలను అభినందించారు. 2026 మార్చి 31లోగా నక్సలిజాన్ని అంతమొందిస్తామని షా స్పష్టం చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ స్పందిస్తూ.. మార్చి 2026 నాటికి దేశంలో, ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని అంతం చేయాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పాన్ని బలోపేతం చేస్తూ.. భద్రతా దళాలు నిరంతరం విజయం సాధిస్తున్నాయని.. లక్ష్యం వైపు వేగంగా కదులుతున్నాయని అన్నారు. క్లిష్ట భౌగోళిక పరిస్థితులు, అనేక సవాళ్లు ఉన్నప్పటికీ వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఈ నిర్ణయాత్మకంగా నారాయణపూర్‌లోని ఛత్తీస్‌గఢ్ పోలీసుల డీఆర్‌జీ యూనిట్ పూర్తి నిబద్ధత, దృఢ సంకల్పంతో పూర్తి చేస్తోందన్నారు. సైనికులు సాధించిన ఈ విజయం ప్రశంసనీయమని, వారి ధైర్యసాహసాలకు తాను సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఎన్‌కౌంటర్‌లో అమరుడైన జవాన్‌కు నివాళులర్పించారు. గాయపడ్డ వారంతా వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఢిల్లీ అతలాకుతలం

న్యూఢిల్లీ

భారీ తుపాను ధాటికి దేశ రాజధాని అతలాకుతలం అయ్యింది. బుధవారం సాయంత్రం నుంచి ధూళి, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు సమీపంలోని నోయిడా ప్రాంతాన్ని ఈ సాయంత్రం పెనుగాలులు, కుండపోత వర్షం ముంచెత్తాయి. అకాల వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడినప్పటికీ, ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈదురుగాలులు, భారీ వర్షంతో ఒక్కసారిగా ఢిల్లీలో వాతావరణం మారింది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గంటకు 79 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో ఈ స్థాయిలో గాలుల వేగం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ తీవ్రతకు అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకూలగా, పలు హోర్డింగ్‌లు విరిగిపడ్డాయి. లోధి రోడ్డు ప్రాంతంలో వడగళ్ల వాన కూడా కురిసింది. దీంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయాలు ఏర్పడ్డాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, పెనుగాలులు మాత్రం తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఆకస్మిక వాతావరణ మార్పుల కారణంగా విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడింది. ఢిల్లీ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశారు. వాతావరణం అనుకూలించకపోవచ్చని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ వివరాల కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థలను సంప్రదించాలని ఎక్స్ వేదికగా తెలిపారు. ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి సంస్థలు కూడా తమ ప్రయాణికులకు ఇదే విధమైన సూచనలు చేశాయి. విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమాన స్థితిని తనిఖీ చేసుకోవాలని కోరాయి. ఢిల్లీ నుంచి శ్రీనగర్ వెళుతున్న ఇండిగో విమానం భారీ కుదుపులకు లోనైందని షేక్ సమీవుల్లా అనే ప్రయాణికుడు ఎక్స్ వేదికగా ఒక వీడియో పోస్ట్ చేశారు. విమానం గాల్లో ఉండగా సీట్లు తీవ్రంగా కదులుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. కెప్టెన్ చాకచక్యంగా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఢిల్లీతో పాటు హర్యానా, యూపీ రాష్ట్రాల్లోనూ పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఢిల్లీకి వర్షాలు ఉండడంతో.. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సోషల్ మీడియాలో తుపాను బీభత్సానికి సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

## సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడరు

న్యూఢిల్లీ

సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడరని, కానీ కేసుల పెండింగ్‌కు న్యాయవ్యవస్థ నింద భరించాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వేసవి సెలవుల అనంతరం తమ పిటిషన్‌ను లిస్టింగ్ చేయాలంటూ ఒక న్యాయవాది పట్టుబట్టడంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. మొదటి ఐదుగురు న్యాయమూర్తులు సెలవుల్లో కూడా కూర్చుని తమ విధులు కొనసాగిస్తున్నారని, అయినా పెండింగ్ కేసులపై న్యాయవ్యవస్థను తప్పుపడతారని, వాస్తవానికి సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులే ఇష్టపడటం లేదని ధర్మాసనం పేర్కొంది. పాక్షిక న్యాయస్థాన పనిదినాల్లో రెండు నుంచి ఐదు వరకు వెకేషన్ బెంచ్‌లు పనిచేస్తున్నాయని, అందులో సీజేఐతో కూడిన ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు కూడా విధి నిర్వహణలో ఉంటున్నారన్నారు. అంతకుముందు కేవలం రెండు బెంచ్‌లు మాత్రమే సెలవు దినాల్లో పనిచేసేవని, సీనియర్ జడ్జీలు వచ్చేవారు కారని ఆయన తెలిపారు.

## బలూచ్ బాంబ్ దాడిపై పాక్ ఆరోపణలు..

## తోసిపుచ్చిన భారత్

**న్యూఢిల్లీ:** బలూచిస్థాన్‌లో స్కూల్ బస్సుపై జరిగిన బాంబు దాడిలో ప్రమేయం ఉందన్న పాకిస్థాన్ ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. పాక్ సైన్యం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నదని విమర్శించింది. ఉగ్రవాదానికి కేంద్రంగా పేరుగాంచిన పొరుగు దేశం అలాంటి వాదనలు చేయడం సాధారణమని పేర్కొంది. బలూచిస్థాన్‌లోని స్కూల్ బస్సుపై జరిగిన బాంబు దాడిలో నలుగురు విద్యార్థులు సహా ఆరుగురు మరణించారని, 12 మందికి పైగా గాయపడ్డారని బలూచిస్థాన్ సీఎం సర్ఫరాజ్ బుగ్టి మీడియాకు తెలిపారు. కాగా, ఈ దాడిలో భారత్ ప్రమేయం ఉందని పాకిస్థాన్ మిలిటరీ మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) ఆరోపించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ దీనిని తీవ్రంగా ఖండించారు. నిరాధారమైన ఆరోపణలని అన్నారు. 'ఉగ్రవాదానికి ప్రపంచ కేంద్రంగా ఉన్న దాని ఖ్యాతి నుంచి దృష్టిని మళ్లించడానికి, సొంత ఘోర వైఫల్యాలను దాచడానికి, పాకిస్థాన్ తన అంతర్గత సమస్యలన్నింటికీ భారత్‌ను నిందించడం ఆ దేశ స్వభావంగా మారింది' అని విమర్శించారు.

## యూపీఐ లావాదేవీలు

## ఇక మరింత సురక్షితం

దేశంలో మొబైల్ ఫోన్ల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలను అరికట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. టెలికాం శాఖ (డాట్) బుధవారం 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్' (ఎఫ్ఆర్ఐ) అనే నూతన వ్యవస్థను భాగస్వామ్య పక్షాలతో పంచుకోనున్నట్లు ప్రకటించింది. ఈ విశ్లేషణాత్మక సాధనం, సైబర్ మోసాల నివారణలో ఆర్థిక సంస్థలకు ముందుగానే కీలక సమాచారాన్ని అందించి అప్రమత్తం చేస్తుంది. డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ లో భాగంగా అభివృద్ధి చేసిన ఈ ఎఫ్ఆర్ఐ వ్యవస్థ, ఏదైనా మొబైల్ నంబర్‌కు డిజిటల్ పద్ధతిలో డబ్బు పంపేటప్పుడు ఆ నంబర్‌తో ముడిపడి ఉన్న ఆర్థిక మోసాల ప్రమాదాన్ని తెలియజేస్తుంది. దీనివల్ల సైబర్ రక్షణ మరింత పటిష్టమవడంతో పాటు, ధృవీకరణ ప్రక్రియలు మెరుగుపడతాయని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒక మొబైల్ నంబర్ ఆర్థిక మోసాలకు పాల్పడే అవకాశం ఎంత ఉందనేదాని ఆధారంగా దానికి 'మధ్యస్థం', 'అధికం' లేదా 'అత్యంత అధికం' అనే రిస్క్ కేటగిరీలను ఈ ఎఫ్ఆర్ఐ నిర్ధారిస్తుంది. దేశవ్యాప్తంగా 90 శాతానికి పైగా యూపీఐ లావాదేవీలు నిర్వహిస్తున్న ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే వంటి ప్రముఖ యూపీఐ వేదికలు ఇప్పటికే ఈ డీఐపీ హెచ్చరికలను తమ వ్యవస్థలలో అనుసంధానించుకునే ప్రక్రియను ప్రారంభించాయి. ఒక ప్రముఖ యూపీఐ సంస్థ, అనుమానిత లావాదేవీల విషయంలో కొంత జాప్యం చేస్తూ, వినియోగదారులకు హెచ్చరికలు పంపి, వారి అనుమతి తీసుకునే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇతర బ్యాంకులు కూడా ఈ సమాచారాన్ని సైబర్ మోసాల నివారణకు చురుగ్గా వినియోగిస్తున్నాయని పేర్కొంది. దేశంలో యూపీఐ చెల్లింపులు అత్యంత ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో, ఈ కొత్త వ్యవస్థ లక్షలాది మంది పౌరులను సైబర్ మోసాల బారిన పడకుండా కాపాడగలదని భావిస్తున్నారు. అనుమానిత మోసాలపై టెలికాం, ఆర్థిక రంగాల్లో త్వరితగతిన, సమష్టిగా చర్యలు తీసుకోవడానికి ఎఫ్ఆర్ఐ వీలు కల్పిస్తుంది. సైబర్ నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు తేలిన, పునఃపరిశీలనలో విఫలమైన, నిర్దేశిత పరిమితులను మించిన మొబైల్ నంబర్ల జాబితాను టెలికాం శాఖకు చెందిన డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్ క్రమం తప్పకుండా సంబంధిత సంస్థలతో పంచుకుంటుంది. ఈ నంబర్లను కూడా సాధారణంగా ఆర్థిక మోసాలకు ఉపయోగిస్తుంటారు. ఏదైనా అనుమానిత మొబైల్ నంబర్‌ను గుర్తించిన వెంటనే, దానిపై విశ్లేషణ జరిపి, ఆర్థిక రిస్క్ స్థాయిని నిర్ధారించి, ఆ సమాచారాన్ని డీఐపీ ద్వారా అన్ని భాగస్వామ్య పక్షాలకు ఎఫ్ఆర్ఐ తక్షణమే తెలియజేస్తుంది. టెలికాం వనరుల దుర్వినియోగాన్ని నిరోధించడానికి, జాతీయ స్థాయిలో సాంకేతిక ఆధారిత పరిష్కారాలను అమలు చేయడానికి, భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయడానికి టెలికాం శాఖ కట్టుబడి ఉందని, తద్వారా పౌరులందరికీ సురక్షితమైన టెలికాం వాతావరణాన్ని కల్పిస్తామని డాట్ స్పష్టం చేసింది.

# భూ భారతి దరఖాస్తుల వెరిఫికేషన్ ను త్వరగా పూర్తి చేయాలి

**మద్దూర్, మే 21:-** భూభారతి పైలెట్ ప్రాజెక్టు మద్దూరు మండలానికి సంబంధించిన భూ భారతి దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం మద్దూరు తహసిల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న భూ సమస్యల దరఖాస్తుల వెరిఫికేషన్ ను కలెక్టర్ పర్యవేక్షించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టు మద్దూరు మండలంలో వచ్చిన మొత్తం దరఖాస్తుల వెరిఫికేషన్ వేగంగా చేయాలన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్, ప్రొసీడింగ్స్, ల్యాండ్ సర్వే ఎంత వరకు వచ్చిందని భూ భారతి ప్రత్యేక అధికారి యాదగిరి ని అడిగి తెలుసుకున్నారు. తిరస్కరించిన దరఖాస్తుల పై ఖచ్చితమైన స్పష్టత ఉండాలన్నారు. ఎందుకు తిరస్కరించామనే కారణాన్ని రైతులకు చెప్పాల్సిన అవసరం ఉంటుందన్నారు. నెలాఖరు నాటికి వంద శాతం దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. భూ సమస్యలకు చట్ట ప్రకారం పరిష్కారం చూపే బాధ్యత అధికారులదేనని ఆమె స్పష్టం చేశారు. విరాసత్ దరఖాస్తుల పరిష్కారానికి నిబంధనలను అనుసరించాలన్నారు. పైలెట్ మండలంలో అధికారులు భూ సమస్యలకు చూపించే పరిష్కారాలనే మళ్ళీ కొత్తగా ఎంపిక చేసే ఒక్కో పైలెట్ మండలాలలో వర్తింప చేసే అవకాశం ఉంటుందని, అందుకే ఒకటికి రెండుసార్లు దరఖాస్తులను



క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో ఆర్డీఓ రామచంద్ర నాయక్, భూ భారతి ప్రత్యేక అధికారి యాదగిరి, మద్దూరు,కొత్తపల్లి, కోస్గి, తహసిల్దారులు, మహేశ్ గౌడ్,జయ రాములు, బక్క శ్రీనివాస్, దయాకర్ రెడ్డి, రెవెన్యూ బృందం తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచులపై కక్ష సాధింపు చర్య మానేయండి

పెండింగ్ బిల్లులు చెల్లించి
స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి.
తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ కమిటీ
రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్

**హైదరాబాద్, సూర్య ప్రతినిధి:** ఓ ప్రభుత్వమా మాపై కక్ష సాధింపు చర్య మానేయండి బిల్లులు చెల్లించండి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ విజ్ఞప్తి గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి స్థానిక సంస్థ ఎన్నికలు



నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఇప్పటికే అనేకమంది సర్పంచులు అప్పులు చేసి వడ్డీలకు డబ్బులు ఇచ్చిన డబ్బులు చెల్లించినందుకు వారితో వేధింపులు భరించలేక అనేకమంది సర్పంచులు సూసైడ్ చేసుకున్నారు, కొంతమంది సర్పంచులు మరణించడం జరిగింది.సర్పంచుల కుటుంబాలు అప్పుల బాధతో చిన్న బిన్నమవుతున్నవి కావున సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరుతున్నాము.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశ బోయిన మల్లయ్య, మెడబోయిన గణేష్, పద్మా రరెడ్డి, బీరప్ప,రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

సమాచార హక్కు రక్షణ చట్టం -2005
యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు
దబ్బుటి శేఖర్



**చౌటుప్పల్, సూర్య ప్రతినిధి:** సమాచార హక్కు రక్షణ చట్టం -2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బుటి శేఖర్ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ విద్యార్థిని , విద్యార్థుల అడ్మిషన్ ల కోసం ప్రైవేట్ పాఠశాలలు తిరుగుతున్న సందర్భంగా తల్లిదండ్రులు గమనించాల్సిన విషయం ఏమిటంటే గవర్నమెంట్ నుండి గుర్తింపు పొందిన పాఠశాల , వాటర్ , మరుగుదొడ్లు , ప్లే గ్రౌండ్ , ఫైర్ అడ్మిషన్ పొందే సమయంలో తప్పనిసరిగా ఇవన్నీ వసతులు ఉన్నాయని గమనించాలని మీ పిల్లల భవిష్యత్ ఆగం చేయొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ విద్యార్థిని , విద్యార్థుల తల్లిదండ్రుల ఫీజుల పేరుతో రక్తం తాగుతూ విద్య ను వ్యాపారంగా చేస్తూ ప్రతి ఒక్క ప్రైవేటు పాఠశాల స్కూల్ ఫీజు ఏ తరగతికి ఎంత ఉందో పట్టిక ఏర్పాటు చేయాలని అలా ఏర్పాటు చేయని ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు ఎంఈఓ , డీఈవో స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోనీ తల్లిదండ్రులకు , విద్యార్థిని , విద్యార్థులకు న్యాయం చేయాలని పత్రిక ప్రకటనలో తెలుపుతున్నాను.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

25వ తారీకు ఆదివారం రోజున యాదవిదిగా పరీక్షలు కొనసాగుతాయి
కళాశాల ప్రిన్సిపాల్ బి.మాతేశ్వరి



**సంస్థాన్ నారాయణపుర్, సూర్య ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుండి 28 వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ బీ.మాతేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి సంవత్సర పరీక్షలు ఉదయం 9 నుండి 12 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు నిర్వహిస్తామని అన్నారు.పరీక్ష సమయానికి విద్యార్థులు అరగంట ముందే సరైన సమయానికి హాజరై ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని తెలియజేశారు. 25వ తారీఖున ఆదివారం రోజు కూడా పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు.

## పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవస్థానం చౌటుప్పల



**సూర్య ప్రతినిధి చౌటుప్పల్ :** హనుమాన్ జయంతోత్సవాలను పురస్కరించుకొని తేదీ 21 మే 2025 చౌటుప్పల్ లోని రోజున శ్రీ పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడమైనది. గణపతి పూజ స్వస్తి వాచనం నవగ్రహ మంటపారాధన మరియు ధ్వజారోహణ కార్యక్రమం దేవస్థాన కమిటీ అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీనివాస్ చారి, గౌరవ అధ్యక్షులు గోశిక బిక్షపతి,కోశాధికారి పోలోజు సూర్య శ్రీనివాస్ చారి, దేవస్థాన ప్రహరీ నిర్మాణ దాతలు మూల సుధీర్, డాక్టర్ శ్వేతా ప్రియాంక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు, అనంతరం ధ్వజారోహణ కార్యక్రమం మరియు హనుమాన్ యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొలను రామదాసు,దోర్నాల పద్మ ఋుషి,ఎం ఎం బాలరాజు,రుద్ర యాదగిరి,మేండే మల్లేష్,కర్నాటి జనార్ధన్,గుర్రం బాలరాజు,ఎక్కడ దేవి శివకుమార్,సుంకి రవి లావణ్య , సూర భూమేష్, ముత్యాల భూపాల్ రెడ్డి, ముత్యాల లక్ష్మారెడ్డి, ముత్యాల మోహన్ రెడ్డి, బోడిగే బాలకృష్ణ, దండా అరుణ్ కుమార్,పోలోజు శ్రీధర్ బాబు ,దేప రాజు, రుద్ర యాదగిరి,భోగ వెంకటేశం కవిత, వనం పాండు, గజ్జల లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు. తర్వాత శ్రీ భావన ఋుషి కళానికేతన్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి సౌజన్యం ఈ పాస్ మిషన్ యంత్రాల పంపిణీ




**సూర్యం మర్రిగూడ ప్రతినిధి** నల్గొండ జిల్లా మునుగోడు డివిజనల్ ఏడిఏ బి వేణుగోపాల్ మర్రిగూడ ఏవో సహస్ మరియు చండూరు ఏవో చంద్రిక కోరమండల్ సేల్స్ మేనేజర్ సతీష్ మండల్ ట్రైనింగ్ ఆఫీసర్ పోలే రమేష్ మర్రిగూడ డీలర్స్ చండూరు డీలర్స్ పిఓఎస్ మిషిన్లు సుమారు 50 మంది డీలర్లకు 30000 విలువగల మిషిన్లు కోరమండల్ ఇంటర్నేషనల్ వారు అందజేశారు సాంకేతిక టెక్నికల్ ఇలాంటి ఇబ్బందులు లేకుండా ఉండడానికి ఈ మిషన్లు అందజేశారు డీలర్స్ అందరూ మర్రిగూడ మరియు చండూరు డీలర్స్ కోరమండల్ ఇంటర్నేషనల్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు

## రైతులకు ప్రతి మొక్కకు 200 రూపాయలు




**సూర్య ప్రతినిధి మర్రిగూడ** పతంజలి ఆయిల్ ఫామ్ సదస్సు నల్గొండ జిల్లా మర్రిగూడ మండల్ వట్టిపల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ తోటల గురించి మరియు ప్రభుత్వం అందించే సబ్సిడీ గురించి చండూర్ డి సి ఓ దాసరి శ్రీనివాస్ మరియు మర్రిగూడ మండల్ ఆర్టికల్చర్ అధికారి యాదయ్య పతంజలి కంపెనీ వారు రైతులకు అవగాహన సదస్సు వట్టిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. రైతులకు ప్రతి మొక్కకు 200 రూపాయలు ఖర్చు అవుతుంది గవర్నమెంట్ వారు ముంబై శాతం సబ్సిడీ రూపకంలో ఒక మొక్కకు 20 రూపాయలు రైతుకు అందించింది ఎందుకు డ్రిప్పు సదుపాయం కల్పించబడుతుంది ఎస్సీ ఎస్టీలకు ఫ్రీ బీసీలకు 90% సబ్సిడీతో ట్రిప్స్ సౌకర్యాలు ఏర్పాటు చేసింది ఓసి వారికి 80 శాతం ఏర్పాటుచేసి మూడు సంవత్సరము లో పంటకు వస్తుంది మూడు సంవత్సరాల ఇతర పంటలు వేసుకోవచ్చు నల్గొండ జిల్లాలో ఆయిల్ ఫాం సాగు రైతులకు మార్కెట్ సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ యజమాన్యం తెలియజేశారు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయిల్ యజమాన్యం వట్టిపల్లి గ్రామం ప్రజలకు తెలియజేశారు వట్టిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి రేసులో పొడి శెట్టి వెంకన్న గౌడ్



**గుండాల, సూర్య ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి రేసులో పొడిశెట్టి వెంకన్న గౌడ్ ఉన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నామినేషన్ వేసినారు నామినేషన్ పత్రాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాదగిరి గౌడ్ ఆలేరు పిసిసి ఇన్చార్జి అనిల్ ధన్వంతిలకు నామినేషన్ పత్రంను అందజేసినారు. ఈ కార్యక్రమంలో ఏలూరి రాంరెడ్డి ద్యాప కృష్ణారెడ్డి బండారి వెంకటేష్ పోన్నగాని నారాయణ జోగు రమేష్ కామెడీ రవికుమార్ నరేష్ అన్నెపర్తి యాదగిరి కొడపర్తి భాస్కరు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమినగర్‌లో నూతన కార్యవర్గం ఏర్పాటు... కార్పొరేటర్‌ను కలిసి అభివృద్ధి కోరిన సభ్యులు



**వనస్థలిపురం, సూర్య ప్రతినిధి, మే 21:** బి.యన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో గౌతమి నగర్ కాలనీలో నూతన సంక్షేమ సంఘం కార్యవర్గం ఏర్పడిన సందర్భంగా సభ్యులు మంగళవారం జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో అభివృద్ధి పనులు, ప్రస్తుత సమస్యల పరిష్కారానికి సంబంధించి వినతిపత్రాన్ని అందజేశారు. కార్పొరేటర్ లచ్చి రెడ్డి నూతన కార్యవర్గాన్ని అభినందించి, కాలనీలో వచ్చే రోజుల్లో తగిన ప్రాధాన్యతనిస్తూ అన్ని సమస్యలను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, ట్రెజరర్ సాయిబాబా, ఉపాధ్యక్షులు రాజు, నారాయణరావు, జాయింట్ సెక్రటరీలు గోపీచంద్, హరి రెడ్డి, సుకుమార్, ఆంజనేయులు, లోకేష్ చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరుణాకర్, పి.హెచ్. రెడ్డి, రవికుమార్, కార్యవర్గ సభ్యులు భాస్కర్ గౌడ్, జగన్, శ్రీ రామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్యపురిలో పార్క్ సమస్యలపై కార్పొరేటర్ చర్యలు

రెండు రోజుల్లో పరిష్కారం హామీ



**ఎల్.బి నగర్, సూర్య ప్రతినిధి :** చైతన్యపురి డివిజన్‌లోని ప్రబాత్‌నగర్ పార్క్ పరిసరాల సమస్యలపై కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా స్పందించారు. ఈ రోజు ఉదయం పార్క్‌కి స్వయంగా చేరుకున్న ఆయన, స్థానిక నివాసితులతో కలిసి పరిశీలనలు చేపట్టారు. పార్క్‌లో పేరుకుపోయిన చెత్త, చెట్టు కొమ్మలు, మొద్దుల తొలగింపుతో పాటు పార్క్ నిర్వహణలో లోపాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డీసీ సుజాత కి మార్గదర్శకాలు ఇచ్చి, రెండు రోజుల్లోగా అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట జీ.హెచ్.ఎం.సి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, జవాన్ రమేష్, హార్టికల్చర్ అధికారి సత్యనారాయణ ఉన్నారు. ఈకార్యక్రమంలో కాలనీ వాసులు రాజగోపాల్, నర్సింహారావు, రఘురాం, మూర్తి, రామారావు, శంకర్, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు రుద్రారపు శంకర్, వినోద్ యాదవ్, నవీన్ యాదవ్, రమణ, కుల్దీప్, కన్నా గార్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పార్క్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజల భాగస్వామ్యంతో సమస్యలు త్వరితగతిన పరిష్కరించబడతాయని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

## ఘనంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి



**చండూర్, సూర్య ప్రతినిధి :** భారత దేశానికి తన జీవితాన్నే అర్పించిన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని బుధవారం చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని రాజీవ్ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు రాజీవ్ గాంధీ విశిష్ట సేవలను స్మరించుకున్నారు. దేశ భవిష్యత్తు కోసం ఐటీ విప్లవానికి బీజం వేసిన దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. దేశానికి తన ప్రాణాలను అర్పించిన మహానాయకుడిగా ఆయనను స్మరించాలన్నారు. రాజీవ్ గాంధీ ఆదర్శాలను అనుసరించి ప్రతి కార్యకర్త దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేతలు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు, మాజీ సర్పంచులు కోడి గిరి బాబు, కావలి ఆంజనేయులు, నల్లగంటి మల్లేశం, బొమ్మరగోని సైదులు, భూతరాజు ఆంజనేయులు, మేకల వెంకట్, నాయకులు మందడి శంకర్ రెడ్డి, నర్సింహ, మాజీ కౌన్సిలర్ మంచుకొండ సంజయ్, సంకోజు బ్రహ్మం, కల్లెట్ల మారయ్య, భూతరాజు వేణు, బూతరాజు దశరథ, బెల్లంకొండ శేఖర్ గౌడ్, గండూరి జనార్ధన్, ఇతరులు బీనపల్లి శేఖర్ గౌడ్, పున్న ధర్మేందర్, పన్నాల లింగయ్య యాదవ్, గజ్జల కృష్ణారెడ్డి, ఇరిగి శంకర్, ఇరిగి వెంకటేశం, నల్ల కృష్ణయ్య, మహిళా అధ్యక్షురాలు పల్లవి, జంగయ్య, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత: మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్



**మద్దూర్, మే 21:-** మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ నీ మద్దూర్ పోలీసులు దాడులు నిర్వహించి పెద్ద పూర్ గ్రామ శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్కు తరలించి డ్రైవర్ శ్రీనివాస్,ఒట్టు పల్లి తండా, ఓనర్ దేవ్ సింగ్ నాయక్, తుంకిమెట్ల తాండ కు చెందిన వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ గారు హెచ్చరించారు.

## వివాహ వేడుకలలో పాల్గొన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్


కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపూర్, సూర్య ప్రతినిధి** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు సోమన బోయిన చంద్రశేఖర్ యాదవ్ బామ్మర్ది జనగాం వాస్తవ్యులు మహేష్ యాదవ్– మౌనిక దంపతుల వివాహ వేడుకలు శ్రీ వెంకటేశ్వర గార్డెన్ ఫంక్షన్ ఫంక్షన్ హాల్ లో వారి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి


ఈ కార్యక్రమంలో , బిఆర్ఎస్ నాయకులు జక్కిడి ధన్వంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, జక్కలి విక్రమ్, చిలువేరు అంజయ్య, ఉప్పల నాగరాజు, సోమనబోయిన నిరంజన్, రేవన పెల్లి గోపాల్, బద్దుల యాదగిరి, ఈసం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి నామినేషన్ల స్వీకరణ



**గుండాల, సూర్య ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా : గుండాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి డిసిసి అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి,ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో పిసిసి అబ్జర్వర్ ధన్వంతరి,పులి అనిల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుండి మండల పార్టీ అధ్యక్ష పదవికి 22 అప్లికేషన్ ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ పదవికి 3 అప్లికేషన్ మొత్తం 25 అప్లికేషన్లను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రామ్ రెడ్డి,ద్యాప కృష్ణారెడ్డి,బండారి వెంకటేష్,పొన్నగాని నారాయణ,జోగు రమేష్,కెమిడి రవికుమార్,కోర్న నరేష్,అన్నేపర్తి యాదగిరి,కోడపర్తి భాస్కర్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కైసర్



**సంస్థాన్ నారాయణపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండలం కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర గార్డెన్ లో జనగాం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైకనీ శ్రీను యాదవ్ అలివేలు దంపతుల కుమారుడు మహేష్ వివాహం ఆరెగూడెంకు చెందిన వంగూరి ఎట్టయ్య యాదవ్ నాగమణి దంపతుల కుమార్తె మౌనిక తో బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్ హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ కాలేక్,మాజీ ఎంపీటీసీ సభ్యులు బెల్లంకొండ శంకరయ్య,మాజీ వార్డు సభ్యులు బెల్లంకొండ నరసింహ పత్రిక విలేకరి దువ్వ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**గండిపేట్ : సూర్య ప్రతినిధి** అర్హులందరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీలో ఎల్%-%1 జాబితాలో అర్హులైన వారికి జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాలను 16 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ శ్రీధర్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



# శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి

### ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు -మేడబోయిన మమతజెవివి రమేష్

**చౌటుప్పల్, సూర్య ప్రతినిధి :** విద్యార్థులకు శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని, తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, మే 21 నుండి 25 వరకు జరుగు జిల్లా క్లాసులు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు మేడబోయిన మమత, జన విజ్ఞాన వేదిక నాయకులు రమేష్ అన్నారు... బుధవారం రోజున చౌటుప్పల్ లోని చందన హైస్కూల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ ( ఎస్ఎఫ్ఐ ) జిల్లాస్థాయి క్లాసులు మే 21 నుండి 25 వరకు జరుగుతున్నాయి. బుధవారం మొదటి క్లాసు శాస్త్రి ఆలోచన క్లాసును జన విజ్ఞాన వేదిక నాయకులు రమేష్ బోధించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులు శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలని, పాలక ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, నూతన విద్యా విధానం అమలువైతే బడుగు బలహీన విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫెలోషిప్లను భర్తీ చేయాలని అదేవిధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రజా పాలన చెప్పి అధికారులను వచ్చి సంవత్సరం గడుస్తున్న గాని విద్యా రంగంలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాక విద్యార్థులకు చదువు దూరమయ్యే పరిస్థితి నెలకొందని రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని విద్యా రంగంలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనపై అలవాటు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై మతత్వ భావాలను పెంచే విధంగా కృషి చేస్తుందని ఈ విధానంపై వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా ఈ తరం విద్యార్థి యువకులపై ఉందని అదేవిధంగా చౌటుప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు సమాజ మార్పు కోసం, సంఘ విస్తరణ కోసం విద్యార్థుల ఆలోచనలను మార్చే విధంగా ఈ శిక్షణ తరగతులు ఎంతో తోడ్పాటు అందిస్తాయని వారు అన్నారు.




ఈ కార్యక్రమంలో పిఎన్ఎమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వారు గోవర్ధన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ లావుడియ రాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు జిల్లా సహాయ కార్యదర్శి తెగుళ్ల శ్రీనివాస్ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె శివకుమార్, మాజీ జిల్లా నాయకులు తడక మోహన్, జిల్లా కమిటీ సభ్యులు పుట్టల ఉదయ్ మైసొల్ల నరేందర్, మాజీ మండల అధ్యక్షులు బర్రె రాజు, పిఎన్ఎమ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ, వరుణ్,నందు,శివ,కార్తీక్, మధు, తదితరులు పాల్గొన్నారు.....

# భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి






**నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**సంస్థాన్ నారాయణపూర్, సూర్య ప్రతినిధి:** భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కరెంటోతూ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ టెలి కమ్యూనికేషన్ విప్లవంతో దేశాన్ని 21 శతాబ్దంలోకి తీసుకెళ్లిన ధార్మినీకుడు రాజీవ్ గాంధీ అని అతి చిన్న వయసులో ప్రధానమంత్రి అయిన వ్యక్తి రాజీవ్ గాంధీ గారినిరాజీవ్ గాంధీ ప్రభుత్వం ఆధునీకరణ, ఉదారీకరణలపై దృష్టి సారించింది. కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్లు వంటి రంగాలలో అతను అనేక ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టాడు. రాజీవ్ గాంధీని భారతదేశంలో సమాచార విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్ విప్లవం యొక్క ఘనత అతనికే చెందుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్, ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి, మందుగుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, నోముల మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, రాస మల్ల యాదయ్య, బిక్షపతి నాయక్, అక్బర్ అలీ, నయీమ్ షరీఫ్, రహీమ్ షరీఫ్, గణం అంజయ్య, కుక్కల నరసింహ, లోడే రఘు, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, చిలువేరు అంజయ్య, రాచకొండ రమేష్ బాబు, పగిళ్ల శేఖర్, వీరమల్ల స్వామి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రమేష్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు ఉప్పల నాగరాజు, అంతటి స్వామి గౌడ్,కొండ నవీన్ గౌడ్, చిలువేరు శంకర్, రేవన పెల్లి గోపాల్, బద్దుల యాదగిరి యాదవ్, ఈసం శివకుమార్, రాస మల్ల వీరస్వామి, గంగాన బోయిన బాలకృష్ణ, అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి ఘనంగా - దేశం కోసం త్యాగం చేసిన మహానాయకుడికి శ్రద్ధాంజలి



**కూకట్‌పల్లి, మే 21 (సూర్య ప్రతినిధి):** భారతదేశానికి సాంకేతిక విప్లవానికి పునాదులు వేసిన దార్శనికుడు, మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా కేపిహెచ్‌బీ కాలనీ రాజీవ్ సర్కిల్ వద్ద నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు రాజీవ్ గాంధీ విగ్రహానికి పుష్పమాలలు అర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ: "దేశ సేవ కోసం తన ప్రాణాలను అర్పించిన రాజీవ్ గాంధీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. అతి పిన్న వయస్సులో ప్రధాని పదవిని చేపట్టి, శాస్త్రీయ, సాంకేతిక రంగాలను పురోగమింపజేసిన ఆయన, ఐటీ విప్లవానికి బీజం వేశారు. మనం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి పరిజ్ఞానాల బాటలో నడుస్తున్నాం అంటే అది రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనం," అని పేర్కొన్నారు. అలాగే, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ దేశ అభివృద్ధికి మార్గదర్శకంగా ఉన్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన ఆశయాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య వ్యక్తులు: గాలి బాలాజీ (టీపీసీసీ మాజీ కార్యదర్శి), పి. నాగిరెడ్డి (ఏ బ్లాక్ అధ్యక్షుడు), తూము వేణు (బి బ్లాక్ అధ్యక్షుడు), పుష్పా రెడ్డి (ఏఎంసి చైర్మన్), శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి, గోపిశెట్టి రాఘవేందర్ (కాంటెస్టెడ్ కార్పొరేటర్), సంజీవ్ రావు, మేకల మైకేల్, కొండల్ రెడ్డి, తూము సంతోష్, అరవింద్ రెడ్డి, ప్రకాష్ ముదిరాజ్ (ఏఎంసి వైస్ చైర్మన్), ఫణింద్ర, సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్ (మూసాపేట్ డివిజన్), గంధం ఏసు రాజు, సప్పిడి భాస్కర్, నర్సింహా యాదవ్, సంధ్య (బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు), పొన్నం రజిత, మారుతీ, భారతమ్మ, జోజమ్మ, జ్యోతి, బండి సుధా, మధు మోహన్, అనిల్ యాదవ్, పొడుగు అప్పారావు తదితరులు మహిళలు, యువత, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## యాసిడ్ తో నోరు కడగాల్సి వస్తుంది జాగ్రత్త కేటీఆర్ - ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నల్లగొండలో మాట్లాడిన మాటలు చూస్తుంటే ప్రజలు ముక్కుమీద వేలు వేసుకునేలా ఉన్నాయారు.**



**యాదగిరిగుట్ట, సూర్య ప్రతినిధి :** అధికారం కోల్పోయిన తర్వాత మదంతో కేటీఆర్ పిచ్చి ఎక్కి మాట్లాడుతున్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వైపు సంక్షేమం, ఓ వైపు అభివృద్ధి చేస్తుంటే నల్గొండకు వచ్చి అవాకులు చెవాకులు మాట్లాడుతూన్న కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవలన్నారు. నల్లగొండ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ,కోమటిరెడ్డి వెంకట రెడ్డి గురించి,ఎమ్మెల్యేల గురించి నోరు జారీ మాట్లాడుతున్నారని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రాజెక్టుల పై తాగు,సాగు నీటి పై సమీక్ష సమావేశలతో ప్రాజెక్టులను,కాల్వలను ముందుకు తీసుకొని పోతుంటే మంత్రుల గురించి మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందన్నారు. మీ పది ఏళ్ల పాలనలో ఎక్కడ అభివృద్ధి కాలేదన్నారు. మీ పది ఏళ్ల పాలనలో మీ నాయనా, మీ బావ, చెల్లె దోపిడీకి తెలంగాణ నష్టానికి గురైందన్నారు. నల్గొండ జిల్లా మంత్రులు,ఎమ్మెల్యే ల గురించి మాట్లాడే నైతిక విలువలు మీకు లేవన్నారు. నల్గొండ జిల్లా అన్నం పెట్టే జిల్లాగా మారింది దాన్ని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు చేసిన అప్పులు తీర్చుకుంటు రేవంత్ రెడ్డి అన్నిటినీ సరిదిద్దుకుంటూ పాలనా అందిస్తున్నారని అన్నారు. మీవి కమిషన్ దందా,కాళేశ్వరం దందా,లిక్కర్ దందా ,మిషన్ భగీరథ స్కామ్ ,గోర్ల,బర్ల స్కామ్, అన్ని స్కాములను గుర్తు చేసి వెయ్యి ఎలుకలు తీన్న పిల్లి తీర్థ యాత్రలు పోయినట్టు కేటీఆర్ మాటలు ఉన్నాయన్నారు. మరొకసారి ఎమ్మెల్యేలు,మంత్రుల గురించి మాట్లాడితే కేటీఆర్ నోరును యాసిడ్ పోసి కడుగుతామన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన చేసిన కమీషనర్ శరత్‌చంద్ర




**గండిపేట్ :** సూర్య ప్రతినిధి పరిసరాల శుభ్రతతోనే ప్రజలంతా ఆరోగ్యవంతంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 5వ డివిజన్‌లోని కపిలనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. సన్‌సిటీ ప్రధాన రహదారిపై స్వీపింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు కృష్ణ, రాము తదితరులున్నారు.

# మత్తెక్కిస్తారు... మైమరిపిస్తారు..దోచేస్తారు..

**విజయవాడ :** అమ్మాయిలతో మాట్లాడాలంటే భయమా? వెంటనే మీ పిరికితనాన్ని పక్కనపెట్టేయండి.. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని.. మీకు నచ్చిన అమ్మాయిలతో చాటింగ్ చేసేయండి.. అంటూ.. మత్తుగా అందమైన అమ్మాయిలు మాటలు చెబుతారు. ఆ మాయమాటల వలలో పడి ఎందో విద్యార్థులు, ఉద్యోగులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. మత్తెప్రేమగా మాటలు కలపుతారు. నెమ్మదిగా డేటింగ్‌కి పిలుస్తారు. చివరికి చీటింగ్ చేస్తారు. మోసాలే లక్ష్యంగా యాప్‌లోని మహిళలు, నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కొన్నిచోట్ల నిలువుదోపిడీకి గురై యువకులు బలవన్మరణానికి పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు, సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తులు, చదువుకునే విద్యార్థులే వీరి టార్గెట్.ఖాళీగా ఉన్నాం కదా... బోర్ కొడుతుందనో.. సరదాగా చాటింగ్‌కు దిగారా? ఇక అంతే సంగతులు. ఒక్కసారి వారి మాయలో పడితే.. రకరకాలుగా టార్చర్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. వైజాగ్‌కు చెందిన ఓ ఇంజనీర్‌కు డేటింగ్ యాప్‌లో ఓ మహిళ పరిచమైంది. తనది హైదరాబాద్ అని పరిచయం చేసుకుంది. ఆ తర్వాత ఇద్దరు వీడియో కాల్ వరకు వచ్చారు. అన్నింటినీ ఆమె తన ఫోన్లో రికార్డు చేసింది. ఇక బెదిరింపులకు దిగింది. బంధువులు, స్నేహితులను ట్యాగ్ చేసి సోషల్ మీడియాలో ఆ వీడియోలు పెడతానని బెదిరించి.. అతని నుంచి ఏకంగా రూ.28 లక్షలు వసూలు చేసింది.ప్రస్తుతం అనేక రకాల చాటింగ్, డేటింగ్ యాప్‌లు మార్కెట్లో ఉన్నాయి. మెసేజ్‌లకు నగదు చెల్లిస్తే.. కొంత సమయం వరకు అమ్మాయిలు చాటింగ్ చేస్తారు. సమయం అయిపోయన తర్వాత అందులో డబ్బులు పెట్టి కాయిన్స్ కొనాల్సి ఉంటుంది. అలా కాయిన్స్ కొంటే.. మెసేజ్ చాటింగ్, వీడియో చాటింగ్ ఇలా వివిధ రకాలుగా ఆప్షన్స్ వస్తాయి. ఇక్కడి నుంచి డబ్బులు కాజేయడం ప్రారంభమవుతుంది. యాప్ నిర్వాహకులు అమ్మాయిలను నియమించుకొని.. జీతం తోపాటు వారికి కస్టమర్ నుంచి వచ్చిన డబ్బులో కమిషన్ కూడా ఇస్తున్నారు. ఇలా పెద్దఎత్తున చాటింగ్, డేటింగ్ పేరుతో మాఫియా నడుపుతున్నారు.యాప్‌లో వీడియో కాల్ చేయాలని యువతులు, మహిళలు రెచ్చగొడతారు. వారు చెప్పినట్లు చేసిన అనేక మంది ఉద్యోగులు, విద్యార్థులు జీవితం నాశనం చేసుకున్నారు. గతేడాది కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఎంపీడీవో.. ఇలానే ఓ వీడియో చాట్ చేశారు. దాన్ని రికార్డు చేసుకున్న ఆ మహిళ.. ఎంపీడీవోను బెదిరించింది. రూ.20 లక్షల వరకు వసూలు చేసింది. అయినా వదిలిపెట్టలేదు. వీడియోలు ఉన్నతాధికారులకు పంపుతానని బెదిరింపులకు పాల్పడగా.. చివరికి ఆ ఎంపీడీవో ఆత్మహత్య చేసుకున్నారు.పని ఒత్తిడిలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వర్క్ ఫ్రం హోం చేసేవారు, విద్యార్థులు.. 22 నుంచి 35 ఏళ్ల వయసున్నవారే వీరి లక్ష్యం. ఒంటరిగా పీలవుతున్నారా? లైఫ్‌లో ఎంజాయ్‌మెంట్ కోరుకుంటున్నారా.. అంటూ తమవైపు లాగుతారు. హైదరాబాద్‌కు చెందిన 36 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి.. ఓ డేటింగ్ యాప్‌లో ఓ యువతి పరిచయం అయింది. తాను వైద్యురాలినని, విదేశాల్లో ఉంటున్నానని మాట కలిపింది. ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే.. బాగా రిటర్న్ వస్తాయని నమ్మబలికింది. అలా అతని నుంచి తనకు తెలిసిన ఖాతాకు రూ.45 లక్షలు ట్రాన్స్‌ఫర్ యించుకుంది. ఆ తర్వాత ముఖం చాటేసింది. మోసపోయానని గుర్తించిన ఆ టెక్కీ.. పోలీసులను ఆశ్రయించారు.విజయవాడకు చెందిన శేఖర్ అనే స్టూడెంట్‌కు.. యాప్‌లో ఓ అమ్మాయితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త పబ్ వరకు వెళ్లింది. ఒకరోజు పబ్‌కు తీసుకెళ్లి.. అన్నీ ఖరీదైన వాటిని ఆర్డర్ చేసింది సదరు యువతి. రూ.20. నుంచి రూ.30 వేల వరకు శేఖర్‌తో ఖర్చుచేయించింది. అయితే.. అప్పటికే ఆ పబ్ నిర్వాహకులతో ఒప్పందం చేసుకున్న యువతి.. కమిషన్ తీసుకుందని.. శేఖర్‌కు తెలిసింది. దీంతో అతను పోలీసులను ఆశ్రయించాడు. ఇలాంటి యాప్‌లకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్



భారత ఆర్థిక వ్యవస్థ ఓరేంజ్‌లో దూసుకుపోతోంది అనేక రంగాలపై ఏకకాలంలో పనిచేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి తయారీ రంగానికి ప్రాధాన్యత ఉన్న చోట ప్రోత్సహిస్తోంది. మరోవైపు, ఎగుమతులను పెంచడంపై ప్రభుత్వం వేగంగా కృషి చేస్తోంది. అటువంటి పరిస్థితిలో, ప్రభుత్వం పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం దక్కుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు, ఎగుమతులకు సంబంధించి భారతదేశానికి వచ్చిన వార్తలను బట్టి, ప్రపంచ స్థాయిలో భారతదేశం తన బలాన్ని అమాంతం పెంచుకుంటోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతి పరంగా ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించింది.భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులలో నాల్గవ అతిపెద్దదిగా అవతరించింది. 2014-15లో 105 దేశాలు భారతీయ సముద్ర ఉత్పత్తులను దిగుమతి చేసుకోగా, 2025 ఆర్థిక సంవత్సరంలో 130 దేశాలు పెరిగాయని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024-25లో, భారతదేశం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 2014-15లో ఇది 10.51 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఆక్వాకల్చర్ పద్ధతుల్లో పురోగతి, మెరుగైన కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ నాణ్యత నిబంధనలకు కట్టుబడి ఉంది. దీంతో దేశ సముద్ర ఎగుమతులు 2015 ఆర్థిక సంవత్సరంలో వి5.4 బిలియన్ల నుండి 2024-25 నాటికి వి7.2 బిలియన్లకు పెరుగుతాయని భావిస్తున్నారు. ఈ విస్తరణ భారతీయ సముద్ర ఉత్పత్తులకు పెరుగుతున్న ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌ను, అధిక విలువ కలిగిన మార్కెట్లలోకి ప్రవేశించడానికి ఎగుమతిదారులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఒక అధికారి తెలిపారు. ఎగుమతి గమ్యస్థానాలు ఈ వైవిధ్యీకరణ మార్కెట్ నష్టాలను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధికి అవకాశాలను తెరుస్తుందని ఆయన అన్నారు.సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం ర్యాంకింగ్ 2014-15లో ఎనిమిదవ స్థానం నుండి నాలుగు స్థానాలు మెరుగుపడింది. ఇది ప్రపంచ మార్కెట్‌లో దాని పెరుగుతున్న పోటీతత్వాన్ని, విశ్వసనీయతను సూచిస్తుంది. గత దశాబ్దంలో భారతదేశ సముద్ర ఎగుమతులు పరిమాణం, విలువ పరంగా బలమైన వృద్ధిని కనబరిచాయని, ప్రపంచ సముద్ర ఆహార వాణిజ్యంలో దేశాన్ని ప్రధాన పాత్రధారిగా నిలబెట్టాయని అధికారి తెలిపారు. ఈ కాలంలో 3.15 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటుతో, భారతదేశం ప్రపంచ సగటు వృద్ధి రేటు 2.7 శాతం కంటే ముందుంది, అంతర్జాతీయ మత్స్య రంగంలో దాని వృద్ధి స్థానాన్ని మరింత బలోపేతం చేసింది. జీడీపీ విషయంలో ప్రపంచ అగ్ర దేశాలను వెనక్కినెడుతోంది. భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరుగుతుండడం, యువ జనాభా, పట్టణ ఆదాయాలు పెరగడంతో భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా వృద్ధి చెందుతోంది. ఇప్పటికే భారతదేశం ప్రపంచంలోని 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిన విషయం తెలిసిందే.అయితే 2030 నాటికి భారత్ మరింత బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఈ విషయాన్ని తెలిపింది. 2030 నాటికి 7.3 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగనుందని తెలిపింది. జపాన్‌ను వెనక్కి నెట్టడం ద్వారా ఆసియాలో అదిపెద్ద రెండో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ాడఖ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ తన తాజా పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ తన నివేదికలో తెలిపింది. ఇదిలా ఉంటే 2021, 2022లో వేగవంతమైన ఆర్థిక వృద్ధి తర్వాత, భారత ఆర్థిక వ్యవస్థ 2023 ఆర్థిక సంవత్సరంలో బలమైన వృద్ధిని చూపుతూనే ఉంది. ాడఖ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ అంచనా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.2 నుంచి 6,3 శాతం పెరగనుందని చెబుతోంది. దీంతో భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. ఆసియాలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7.8 శాతంగా ఉంది. ఈ లెక్కన ఆర్థిక వ్యవస్థ ఇలాగే వృద్ధిలో కొనసాగితే.. భారత్ రెండో స్థానంలోకి రావడం ఖాయంగా తెలుస్తోంది. దేశీయంగా డిమాండ్‌లో బలమైన వృద్ధి కనిపిస్తుండడం సానుకూల అంశమని ఎస్ అండ్ పీ చెబుతోంది.ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా అమెరికా అగ్ర స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉండగా, మూడో స్థానంలో జపాన్ ఉంది. అయితే ప్రస్తుతం భారత్‌లో కనిపిస్తున్న వృద్ధి ఇలాగే కొనసాగితే 2030 నాటికి భారతదేశ జీడీపీ జర్మనీని అధిగమిస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక 2039 నాటికి భారత్‌లో 110 కోట్ల మంది భారతీయులకు ఇంటర్‌నెట్ లభించనుందని, 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రాకవడంతో దేశంలో ఇ-కామర్స్ గణనీయంగా 4జీ నుంచి 5జీ సాంకేతికతకు మారడంతో ఇ-కామర్స్ గణనీయంగా వృద్ధి చెందనుంది.

# ఏసీ కంప్రెసరే కారణం...
# తేల్చి చెప్పిన ప్రాథమిక నివేదిక



హైదరాబాద్: హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్‌లో ఆదివారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 8 మంది చిన్నారులతో సహా మె?త్తం 17 మంది మృతి చెందారు. ఈ దుర్ఘటన పాతబస్తీలో తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగాయని ప్రాథమికంగా అంచనా వేసినా.. తాజాగా ప్రమాదానికి గల కారణాన్ని అధికారులు తేల్చారు. ఏసీ కంప్రెసర్ పేలి పోవటం వల్లే మంటలు చెలరేగాయని అన్నారు. ఆ తర్వాత మంటలు క్షణాల్లోనే వ్యాపించినట్లు చెప్పారుచెక్కతో చేసిన మెట్లు, విద్యుత్ మీటర్ బోర్డు, పార్కింగ్‌లో నిలిపి ఉంచిన వాహనాల సీటు కవర్లు, పెట్రోల్ ట్యాంక్ బ్లాస్ట్ కవటం వంటివి క్షణాల్లోనే జరిగిపోయాయని చెప్పారు. జీ+2 ఇంట్లో కింది అంతస్తులో నగల దుకాణం ఉండగా.. రెండో అంతస్తులో ఉన్న ఇంట్లో ప్రహ్లాద్ కుటుంబం నివాసం ఉంటుందని అన్నారు. మె?త్తం 10 గదులకు గాను.. 8 గదుల్లో ఏసీలు ఉన్నట్లు చెప్పారు. ఆ ఇంటికి సరైన వెంటిలేషన్ లేకపోవటంతో ఏసీల వినియోగం పెరిగిందని.. ఎండాకాలంలో ఏసీలను విపరీతంగా వాడడం, కంప్రెసర్లు సైతం ఇరుకు సందులోనే బిగించటంతో వాటిపై ఒత్తడి పెరిగి కంప్రెసర్ పేలినట్లు అధికారులు వెల్లడించారు. జీ+2 ఇంట్లో కింది అంతస్తులో ముత్యాల దుకాణం ఉంది. రెండో అంతస్తులో ప్రహ్లాద్ కుటుంబం నివాసం ఉంటుంది. మొత్తం 10 గదులు ఉన్నాయి. 7 గదుల్లో ఏసీలు ఉన్నాయి. ఆ ఇంటికి సరైన వెంటిలేషన్ లేకపోవటంతో ఏసీల వినియోగం పెరిగిందని.. ఎండా కాలంలో ఏసీలను విపరీతంగా వాడటం, కంప్రెషర్లు సైతం ఇరుకు సందులోనే బిగించటంతో వాటిపై ఒత్తిడి పెరిగి కంప్రెషర్ పేలినట్లు అధికారులు వివరించారు.ఇక ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ దుర్ఘటనను సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసింది. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి నివేదికను జూన్ 30వ తేదీలోగా సమర్పించాలని ఆదేశించింది. కాగా, హైదరాబాద్ నగరంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదాల్లో ఇంత మంది మరణించటం ఇదే తొలిసారి. ఈ విషాదకర ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు సహా పలువురు సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 2 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాయి.

## సాహెబ్ నగర్ ఎస్సీ స్మశాన వాటిక అభివృద్ధికి 26 లక్షల నిధులు మంజూరు
## స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పర్యటన



**ఎల్బీనగర్ జోన్, సూర్య ప్రతినిధి :** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ లోని ఎస్సీ స్మశాన వాటిక అభివృద్ధికి 26 లక్షల రూపాయలు నిధులను బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మంజూరు చేశారు. కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ రాజ్ కుమార్ మరియు గ్రామ సభ్యులతో కలిసి స్మశాన వాటికను పర్యటించారు. ఈ సందర్భంగా, త్వరలోనే స్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహెబ్ నగర్ గ్రామ సభ్యులు దాసరి బాబయ్య, యంజాల బిక్షపతి, కృష్ణ, రాజు, సుధాకర్, సంజీవ్, మహేష్, దుర్గాప్రసాద్, శివకుమార్, వికాస్ మరియు పార్టీ నాయకులు మహేష్ గౌడ్, సురేష్ కుమార్ ఇతరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నేడు పాల్గొనే కార్యక్రమాలు...



**ఇబ్రహీంపట్నం, సూర్య ప్రతినిధి:** ఉదయం 11:00 గంటలకు హయాత్ నగర్ ఎస్ ఎన్ ఆర్ కళ కన్వెన్షన్ హాల్‌లో, అబ్దుల్లాపూర్ మెట్టు మండలం మరియు పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీలకు చెందిన 804 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు (ప్రొసీడింగ్స్) ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అందజేస్తారు. సాయంత్రం 4:00 గంటలకు తొర్రూర్ క్యాంపు ఆఫీస్‌లో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

## తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో... కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం



**మహేశ్వరం జోన్, సూర్య ప్రతినిధి :** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఇటీవల మంజూరు చేసిన 43 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మాజీ మంత్రి, శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వంద రోజుల్లోనే మహిళలకు రెండు వేల ఐదు వందలు, తులం బంగారం సహా ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని నేటి వరకు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని తాను హితావు పలికారు. అదే విధంగా, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం మేరకు 'కిట్టు' పేరుతో చెక్కులు అందజేయడం మహిళలకు ఆర్థిక స్వావలంబనకు మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, చెక్కుల లబ్ధిదారులు, స్థానిక మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. సబితా ఇంద్రారెడ్డి ప్రయత్నాలతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమంపై మరింత దృష్టి పెడుతోందని స్థానికులు అభినందించారు.

## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి**




**హైదరాబాద్, మే 21 (సూర్య ప్రతినిధి ):** భారతరత్న, మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ గారి 34వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నాడు గాంధీ భవన్ లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితుల కోసం భారీ రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీలు వి. హనుమంత రావు, మధు యాష్కి గౌడ్, రాష్ట్ర మత్స్యకారుల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ సయ్యద్ ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన యువకులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ, "రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతిక విజ్ఞానం, టెలికాం, కంప్యూటర్ రంగాల్లో గణనీయమైన ప్రోత్సాహం ఇచ్చిన దార్శనిక నాయకుడు. ఆయన ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ వ్యవస్థ భారత ప్రజాస్వామ్యాన్ని గ్రామ స్థాయిలో బలపరిచేలా చేసింది," అని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## కిరాతగా మోహన్ లాల్.. స్పెషల్ గ్లింప్స్ అదిరింది!

మోహన్‌లాల్ పుట్టినరోజు (మే 21) సందర్భంగా 'కన్నప్ప' చిత్ర బృందం ఒక అద్భుతమైన స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌లో మోహన్‌లాల్ కిరాత అనే దైవిక శక్తితో ముడిపడిన పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌లో ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, నటన అభిమానులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇక కన్నప్ప విషయానికొస్తే.. విష్ణు మంచు హీరోగా నటించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, ఆర్.శరత్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, బ్రహ్మానందం ఇతర కీలక పాత్రలు పోషించారు.ఆవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది.

## నుదుట సింధూరం ఎరుపు రంగు చీరలో అదితి..

### కేన్స్‌లో మెరిసిన భారతీయ అందం!



ఫ్రాన్స్ వేదికగా ప్రపంచ ప్రఖ్యాత 77వ కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ప్రపంచ నటీనటులు తమ స్టైల్‌తో ఆకట్టుకుంటుండగా, భారతీయ నటీమణులు తమ సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్‌తో పాటు పలువురు నటిమణులు ఈ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలువగా.. తాజాగా బాలీవుడ్ నటి అదితి రావు హైదరి తన ట్రెడిషనల్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. కేన్స్ రెడ్ కార్పెట్‌పై అదితి రావు హైదరి ఎరుపు రంగు డిజైనర్ చీరలో కనిపించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ఈ చీరకు తగ్గట్టుగా ఆమె నుదుట సింధూరం ధరించి, సంప్రదాయ భారతీయ వధువులా మెరిసిపోయారు. గోల్డెన్ బ్లౌజ్, నామమాత్రపు ఆభరణాలతో ఆమె లుక్ మరింత ప్రత్యేకంగా నిలిచింది. అదితి ఎంపిక చేసుకున్న ఈ చీర ఆమెకు చక్కగా సెట్ అయ్యింది. ఇక అదితి లుక్‌పై నెటిజన్లు స్పందిస్తూ.. ఎరుపు రంగు చీర, నుదుట సింధూరంతో అదితి అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుందని ప్రశంసిస్తున్నారు. ఆమె ఈ లుక్‌లో భారతీయ సంస్కృతిని కేన్స్ వేదికపై గొప్పగా చాటి చెప్పారని అభిమానులు కొనియాడుతున్నారు. కేన్స్ రెడ్ కార్పెట్‌పై అదితి ప్రదర్శించిన ఈ సంప్రదాయ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## టాలెంట్ ఉన్న యువతకు దిల్ రాజు బంపర్ ఆఫర్!

తెలుగు సినీ పరిశ్రమలో, యావత్ భారతీయ సినీ రంగంలో దిల్ రాజు పేరుకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన మొదటి సినిమా పేరును ఇంటిపేరుగా మార్చుకున్న ఈ నిర్మాత, టాలెంట్‌ను గుర్తించడంలో దిట్ట. ఎంతోమంది హీరోలు, నటీనటులు, దర్శకులు, టెక్నీషియన్లను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసిన దిల్ రాజు, ఇప్పుడు మరో ముందడుగు వేశారు. తెలుగు సినీ పరిశ్రమకు మరింత టాలెంట్‌ను అందించే ప్రయత్నంలో భాగంగా, ఆయన కొత్త ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేశారు. కొత్త ప్రతిభను సినీ పరిశ్రమకు పరిచయం చేయాలనే లక్ష్యంతో దిల్ రాజు తాజాగా దిల్ రాజు డ్రీమ్స్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారు. తన కెరీర్ మొదలు నుంచి ఫ్రెష్ కంటెంట్, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించిన దిల్ రాజు, ఇప్పుడు ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా యువ ప్రతిభావంతులకు అద్భుతమైన అవకాశాలు కల్పించనున్నారు. జూన్ నెల నుంచీ "దిల్ రాజు డ్రీమ్స్" ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో భాగం కావాలనుకునేవారు https://dilrajudreams.com/ లింక్‌పై క్లిక్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపాడు. వివరాలు నమోదు చేసుకున్న తర్వాత, దిల్ రాజు డ్రీమ్స్ బృందం స్వయంగా వారిని సంప్రదిస్తుంది. జూన్‌లో ఈ పోర్టల్ పూర్తిగా సిద్ధమైన తర్వాత, యువ ప్రతిభావంతులు తమ ఆలోచనలను ఈ బృందానికి నేరుగా తెలియజేయవచ్చు. సరైన ప్లాట్‌ఫామ్ దొరకక, సినీ పరిశ్రమలో పరిచయాలు లేక, ఎవరిని ఎలా సంప్రదించాలో తెలియక ఎంతోమంది టాలెంట్ ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారందరికీ ఇది నిజంగా ఒక గోల్డెన్ ఛాన్స్. టాలెంట్ ఉన్నవారు తమను తాము నిరూపించుకోవడానికి దిల్ రాజు స్థాపించినదే ఈ "దిల్ రాజు డ్రీమ్స్.

## తెలుగు సినిమా కోసం 'కాంప్రమైజ్' అవ్వమని చెప్పారు

ఇటీవల కాలంలో సినిమా పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అనే అంశం చాలా హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై సినీ తారలు ఇప్పుడిప్పుడే బహిరంగంగా మాట్లాడుతున్నారు. తమకు ఎదురైన ఛేదు అనుభవాలను పంచుకుంటూ.. వాటిని ఎలా అధిగమించాలో కొత్తతరం నటీనటులకు సలహాలు ఇస్తున్నారు. తాజాగా బాలీవుడ్ హీరోయిన్ సయామీ ఖేర్ కూడా క్యాస్టింగ్ కౌచ్‌పై స్పందించారు. తన కెరీర్ ఆరంభంలో ఓ తెలుగు సినిమా అవకాశం కోసం 'సర్దుకుపోవాలని' అడిగారని, దానికి ఆమె నో చెప్పి.. ఆ సినిమాను వదిలేశానని చెప్పారు. తాజాగా సయామీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నాకు ఇప్పటి వరకు వచ్చిన ఆఫర్ల విషయంలో చాలా హ్యాపీగా ఉన్నాను. మంచి సినిమాల్లో నటించే అవకాశం రావడం నా అదృష్టం. అయితే నా కెరీర్ ఆరంభంలో మాత్రం నాకొక ఛేదు అనుభవం ఎదురైంది. నాకు 19-20 ఏళ్ల వయసులో ఓ తెలుగు సినిమా ఆఫర్ వచ్చింది. ఒక లేడీ ఏజెంట్ నన్ను పిలిచి సినిమా చాన్స్‌ల కోసం 'సర్దుకుపోవాలి' అని చెప్పారు. నేను ఆమెను టెస్ట్ చేయడానికి ప్రయత్నించాను. ఆమె మాటలు అర్థం కానట్లుగా నటించాను. కానీ ఆమె పదే పదే అదే విషయం ప్రస్తావించడంతో 'క్షమించండి, నేను అలాంటి పనులకు దూరంగా ఉంటాను. నాకు కొన్ని పరిమితులు ఉన్నాయి. వాటిని ఎప్పటికీ దాటలేను' అని సున్నితంగా తిరస్కరించాను. అయితే ఆ సమయంలో ఈ విషయాన్ని బయట పెట్టేంత ధైర్యం నాకు లేదు. అందుకే ఆ సినిమాను వదిలేసి నా పని నేను చేసుకుంటూ వెళ్లాను. నా కెరీర్‌లో ఒక్కసారి మాత్రమే 'కమిట్‌మెంట్' లాంటి ఛేదు ఘటన ఎదురైంది' అని సయామీ చెప్పుకొచ్చింది. సయామీ ఖేర్ కెరీర్ విషయానికొస్తే.. 2015లో 'రేయ్' అనే తెలుగు సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయింది. ఆ తర్వాత రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా తీసిన 'మిర్జ్యా' చిత్రంతో సయామి బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.'చోక్డ్' 'ఘూమర్' వంటి చిత్రాలతో పాటు 'స్పెషల్ ఆప్స్', 'ఫాదూ' వంటి వెబ్ సిరీస్‌లు ఆమెకు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టాయి. 2021లో అక్కినేని నాగార్జునతో కలిసి నటించిన 'వైల్డ్ డాగ్' మూవీలో సయామీ కీలక పాత్ర పోషించారు. ఇటీవల రిలీజైన'జాట్' సినిమాలో ఎస్సై పాత్రలో కనిపించారు. ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాల్లో నటిస్తునారు.



## విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన్'లో కీర్తి సురేష్?



"మహానటి" చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్, తన పాత్రల ఎంపికలో కొత్త ధోరణిని అనుసరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకున్న కీర్తి, ఇప్పుడు తన "వెర్షన్ 2.0?ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పుకు కారణం విజయ్ దేవరకొండతో ఆమె నటించబోయే సినిమా 'రౌడీ జనార్దన్'. తాజా సమాచారం ప్రకారం, రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న 'రౌడీ జనార్దన్' చిత్రంలో కీర్తి సురేష్ రొమాంటిక్ పాత్రలో కనిపించబోతోంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండతో లిప్ లాక్ సన్నివేశాలు కూడా ఉండవచ్చని పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు కీర్తి సురేష్ ఏ హీరోతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించలేదు. 'సర్కారు వారి పాట' చిత్రంలో మహేష్ బాబుతో రొమాంటిక్ సన్నివేశాలు ఉన్నప్పటికీ, పూర్తిస్థాయి లిప్ లాక్ లేదు. అయితే, 'రౌడీ జనార్దన్'లో మాత్రం ఇది నిజం కావచ్చని అంచనా వేస్తున్నారు. కీర్తి సురేష్ తన కెరీర్‌లో ప్రయోగాలు చేయడానికి వెనుకాడదు. బాలీవుడ్‌లో 'బేబీ జాన్'తో అడుగుపెట్టినప్పటికీ, ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. అయితే, ఆమెకు అక్కడ కూడా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. నెట్‌ఫ్లిక్స్ కోసం 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో బోల్డ్‌గా నటించబోతున్నట్లు తెలుస్తుంది. పాత పద్ధతిలో వెళితే పని అవ్వదని గ్రహించిన ఈ అమ్మడు రూట్ మార్చినట్లు తెలుస్తుంది. ఇక రౌడీ జనార్దన్ సినిమా విషయానికి వస్తే.. ఇది ఒక మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. విజయ్ దేవరకొండకు 'రౌడీ' ఇమేజ్ ఉండటంతో, ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా సరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ సినిమా గోదావరి జిల్లాల నేపథ్యంలో, స్థానిక రాజకీయాల చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.